ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

అన్నమయ్య


జిల్లా వార్తలు

1

శుక్రవారం 26 ఏప్రిల్ 2024



రాజంపేటలో జరిగిన ప్రజాగళం బహిరంగసభకు హాజరైన అశేష జనం






- అన్నమయ్య, పింఛా డ్యాంలను పునర్ నిర్మిస్తాం
- మిథున్‌రెడ్డి, అమర్‌నాథరెడ్డిలను చిత్తుచిత్తుగా ఓడించండి
- సుగవాసి, నల్లారిని భారీ మెజారిటీతో గెలిపించండి
- రాజంపేట సభలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు
- పెద్దిరెడ్డి కుటుంబాన్ని చిత్తుచిత్తుగా ఓడించండి : పవన్‌కళ్యాణ్
- తాను, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఎన్నికల సభలో పాల్గొనడం ఇదే తొలిసారి : నల్లారి
- రాజంపేటలో అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేస్తాం : సుగవాసి బాలసుబ్రమణ్యం

రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తాం



రైల్వేకోడూరు ప్రజాగళం సభలో ఐక్యత చాటుతున్న చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్, కోడూరు జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్



మాట్లాడుతున్న టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు



రాజంపేటలో ఐక్యత చాటుతున్న చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, నల్లారి కిరణ్, సుగవాసి బాలసుబ్రమణ్యం

రాజంపేట, ఏప్రిల్ 25: వైసీపీ హయాంలో రాజంపేట నియోజకవర్గం అభివృద్ధిలో చాలా వెనుకబడిపోయిందని ఇక్కడి ప్రజల మనోభావాలకు తీవ్ర అన్యాయం జరిగిందని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తానని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. గురువారం సాయంత్రం రాజంపేట పాతబస్టాండులో ప్రజాగళం ఎన్నికల ప్రచార సభలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, మాజీ ముఖ్యమంత్రి, ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి తాను, పవన్‌కళ్యాణ్‌లు ముగ్గురం ఒకే సభలో పాలుపంచుకోవడం ఇదే తొలి సారని చాలా ఆనందంగా ఉందని తెలిపారు. నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, సుగవాసి బాలసుబ్రమణ్యంలను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోవడంలో ప్రధాన బాధ్యులైన వైసీపీ ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమర్‌నాథరెడ్డిలను ఓడించాలని పిలుపునిచ్చారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే జిల్లాల విభజనపై పూర్తి స్థాయి సమీక్షించి రాయచోటికి ఎటువంటి అన్యాయం జరగకుండా అటు మదనపల్లెను, ఇటు రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తామని తెలిపారు. రాజంపేటలో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేస్తానన్నారు. మాచుపల్లి, ఓబిలి, టంగుటూరు బ్రిడ్జిలను పూర్తి చేస్తామన్నారు. ఝరికోన ప్రాజెక్టు నుంచి నుండుపల్లెకు తాగు, సాగునీటిని అందిస్తామన్నారు. గాలేరు-నగిరి కాలువ పనులను పూర్తి చేసి వాటికి అనుసంధానంగా రాజంపేట నియోజకవర్గంలోని అన్ని మండలాలకు నీరందిస్తామన్నారు. ఒంటిమిట్టలో భూదాహానికి బలైన సుబ్బారావు కుమార్తె లక్ష్మీ ప్రసన్నకు ఉద్యోగం ఇచ్చి అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. వైసీపీ నేతలు సుబ్బారావుకు సంబంధించిన భూములను ఆన్‌లైన్‌లో ఎక్కించుకోవడం వల్లే వారి కుటుంబంలో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రాజంపేటలో అన్ని అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేస్తాం

- రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం




రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తామని, అన్నమయ్య, పింఛా ప్రాజెక్టులను పునర్ నిర్మిస్తామని, గాలేరు-నగిరి పూర్తి చేసి నియోజకవర్గంలోని అన్ని మండలాలకు అనుసంధానం చేసి తాగు, సాగునీరు అందిస్తానని రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. రాజంపేటకు వెంటనే మెడికల్ కళాశాలను తెప్పిస్తామన్నారు. తనను ఎమ్మెల్యే అభ్యర్థిగా, కిరణ్‌కుమార్‌రెడ్డిని ఎంపీ అభ్యర్థిగా గెలిపించి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేశ్‌నాయుడు, రాయచోటి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డి, బీజేపీ పార్లమెంటు అధ్యక్షుడు సాయిలోకేశ్, జనసేన పార్టీ పార్లమెంటు నాయకుడు యల్లటూరు శ్రీనివాసరాజు, రాజంపేట నియోజకవర్గ జనసేన నాయకులు అతికారి కృష్ణ, మలిశెట్టి వెంకటరమణ, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శులు బాలిశెట్టి హరిప్రసాద్, సుగవాసి ప్రసాద్‌బాబు, వేమన సతీశ్, డాక్టర్ చెన్నూరు సుధాకర్, నియోజకవర్గ అబ్జర్వర్ దుర్గాప్రసాద్, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మోదుగుల పెంచలయ్య, నియోజకవర్గ నాయకుడు పోలి సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్మగ్లర్లతో ఎమ్మెల్యే భాగస్వామ్యం

- స్మగ్లర్లతో సంబంధాలున్న వారికి బేడీలు వేయిస్తాం
- మంగంపేటలో జరిగిన అక్రమాలను వెలికితీస్తాం
- ప్రజాగళం సభలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్

రైల్వేకోడూరు, ఏప్రిల్ 25: ఎర్రచందనం స్మగ్లర్లతో రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు భాగస్వామ్యం అయ్యాడని, వైసీపీలో ఉన్న ఎర్రస్మగ్లర్లకు బేడీలు వేయిస్తామని, ఎర్రచందనంలో దోచిన డబ్బును కక్కిస్తామని టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌లు తెలిపారు. గురువారం రాత్రి రైల్వేకోడూరులో జరిగిన ప్రజాగళం సభకు వారు హాజరయ్యారు. వారికి టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వరనాయుడు, టీడీపీ జిల్లా పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, రైల్వేకోడూరు పరిశీలకులు హేమాంబధరరావు, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర తదితరులు ఘన స్వాగతం పలికారు.


ఈ సందర్భంగా చంద్రబాబు, పవన్‌కళ్యాణలు మాట్లాడుతూ ఎర్రచందనం చెట్లను కాపాడేందుకు టీడీపీ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని తెలిపారు. వైసీపీ పాలనలో ఎర్రచంనదం స్మగ్లర్లను పెంచి పోషించిందన్నారు. పెనగలూరు మండలానికి సోమశిల బ్యాక్ వాటర్ తెప్పించి చెరువును నింపుతామని తెలిపారు. మంగంపేటలో జరిగిన అక్రమాలను వెలికితీసి విచారణ చేస్తామన్నారు. మంగంపేట బెరైటీస్‌లో వేల టన్నుల ముగ్గురాయిని పాపాల పెద్దిరెడ్డి కుటుంబం దోచుకుందని వాటిని కక్కిస్తామని తెలిపారు. రైల్వేకోడూరులో ఉద్యాన హబ్ ఏర్పాటు చేస్తామని, రైతులు తమ పంటలను కాపాడుకుని గిట్టుబాటు ధరలకు అమ్ముకునేందుకు వీలు కల్పిస్తామన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఉన్న సమస్యలను పరిష్కారం చేస్తామని తెలిపారు. రైల్వేకోడూరులో జనసేన పార్టీ అభ్యర్థి అరవ శ్రీధర్‌ను గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. రైల్వేకోడూరులో ఉత్సాహం చూస్తే గెలుపు సులభంగా ఉంటుందని తెలిపారు. రైల్వేకోడూరు వైసీపీ ఎమ్మెల్యేని చిత్తుచిత్తుగా ఓడించాలన్నారు. కోడూరు-వెంకటగిరి రోడ్డు పూర్తి చేస్తామన్నారు. రైల్వేకోడూరు ప్రాంతం ఉద్యాన పంటలైన అరటి, మామిడి, బొప్పాయికి లాభసాటి అయిన ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయిస్తామన్నారు. వ్యవసాయ పరంగా రైతులకు మంచి సబ్సిడీలు అందిస్తామన్నారు. రాజంపేట ఎంపీ మిధున్ రెడ్డి, స్మగ్లర్ గంగిరెడ్డిలకు రైల్వేకోడూరు ప్రజలు భయపడకుండా ఓటు వేసి మార్పు తీసుకుని రావాలని పిలుపునిచ్చారు. రైల్వేకోడూరు ప్రజలకు తాము అండగా ఉంటామన్నారు. ప్రజలు డబ్బుకు లొంగకుండా ఉండాలన్నారు. రైల్వేకోడూరు నడిబొడ్డున నిలిచి చెబుతున్నాం కూటమి అధికారంలోకి వస్తుందని, రైల్వేకోడూరులో కూటమి బలపరిచిన జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్‌ను గెలిపించాలని కోరారు. రైల్వేకోడూరులో వైసీపీ వారు చేసిన అన్యాయాలు, అరాచకాలు తమకు తెలుసునని తెలిపారు. బీజేపీ రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రైల్వేకోడూరులో జనసేన పార్టీ అభ్యర్థి అరవ శ్రీధర్‌ను, రాజంపేట పార్లమెంట్ కు తనను ప్రజలు గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాపు నాయకులు కల్లా చలపతి, గునిపాటి కిరణ్, అనుమలగుండం చంద్రమోహన్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రాజంపేటలో చంద్రబాబుతో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వేమన సతీశ్

వైసీపీని అదఃపాతాళానికి తొక్కేయండి

- జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పిలుపు



వైసీపీని అదఃపాతాళానికి తొక్కేయాలని రాజంపేట ప్రజలనుద్దేశించి పవన్‌కళ్యాణ్ ఆవేశపూరితంగా పిలుపునిచ్చారు. జగన్ ప్రభుత్వం రాజంపేటకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. వారి ఇసుక దాహానికే అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయి అనేక మంది ప్రాణాలు పోగొట్టుకున్నారని, బాధితులకు ఇళ్లు కూడా కట్టించకుండా రైతులకు ఇంత వరకు న్యాయం చేయలేదన్నారు. ఈ ప్రాంతంలో ఒక్క పరిశ్రమ కూడా లేకపోవడం బాధాకరమన్నారు. తమ ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వస్తే రాజంపేట ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. పిఠాపురం వచ్చి నన్ను ఓడించడానికి ఎంపీ మిథున్‌రెడ్డి తన ఎమ్మెల్యేలతో, తన మందీమార్బలంతో అన్ని శక్తులు ఒడ్డుతున్నాడని అవి ఏమాత్రం సాగబోవన్నారు. తనను ఒకసారి ఢిల్లీలో కలిశారని, ఆ సమయంలో మా జిల్లాకు ఎవరు వచ్చినా తొక్కేస్తామని తనతో అన్నాడని, ప్రస్తుత ఎన్నికల్లో ఆ విషయాన్ని యువతరం గుర్తుపెట్టుకుని గుండె బలంతో సలసలకాగే ఉడుకు రక్తంతో మిథున్‌రెడ్డి కుటుంబాన్ని ఓడించాలన్నారు. ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి రాజంపేటను అడ్డంగా దోచేశారన్నారు. వారి ఇసుక దాహం వల్లే అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయి 30 మంది చనిపోయి అనేక గ్రామాలు మునిగిపోయాయన్నారు. లస్కర్ రామయ్య వల్లే అన్నమయ్య ప్రాజెక్టు సంఘటనలో వందలాది మంది ప్రాణాలతో బయటపడ్డారని ఆ రామయ్యను గుర్తించి తాను రూ.2 లక్షలు ఇచ్చినట్లు తెలిపారు. పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అధికారంలో ఉండి అధికారమదంతో రౌడీయిజం చేసి కొట్టడాలు, చంపడాలు చేయడం వల్లే అనేక మంది ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు.

పవన్‌కళ్యాణ్‌ను నిజమైన పవర్‌స్టార్ చేయాల్సిన బాధ్యత మీదే

- మాజీ సీఎం, ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి



తొలి సినిమా ఫెయిల్ అయ్యి స్ట్రగుల్ స్టార్‌గా అనేక ఒడిదుడుకులు ఎదుర్కొని తరువాత సినిమాలో పవర్‌స్టార్ అయ్యారని, నేటి రాజకీయాల్లో పవర్‌స్టార్‌ను నిజమైన పవర్‌స్టార్‌గా పవన్‌కళ్యాణ్‌ను చేయాల్సిన బాధ్యత నేటితరంపై ఉందన్నారు. రాజంపేట పార్లమెంటు పరిధిలోని ఎంపీ మిథున్‌రెడ్డి చేసిన దుర్మార్గాలను పాపాలరెడ్డి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన తనయుడు మిథున్‌రెడ్డిని ఓడించాలన్నారు. మైనారిటీలు బీజేపీ పట్ల అపోహలను విడనాడాలన్నారు. బీజేపీ ముస్లిం మైనారిటీలకు అనుకూలంగా ఉంటుందన్నారు. తనను ఎంపీ అభ్యర్థిగా, బాల సుబ్రమణ్యంను ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలిపిస్తే ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు.

జీవనోపాధికి వెళ్లి.. విగతజీవులైన ముగ్గురు యువకులు



మృతులు లోకేశ్ (ఫైల్), శశికుమార్ (ఫైల్), సుబ్రహ్మణ్యం (ఫైల్)

రామసముద్రం, ఏప్రిల్ 25: డిగ్రీ పట్టాలు చేతపట్టుకుని జీవనోపాధి కోసం వెళ్లిన ముగ్గురు యువకులు అనుమానాస్పదస్థితిలో మృతిచెందిన సంఘటన గురువారం బెంగళూరులో జరిగింది. మృతుల కుటుంబ సభ్యుల వివరాల మేరకు..

అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలంలోని కనగాని గ్రామానికి చెందిన అమరనారాయణ కుమారుడు శశికుమార్ (25), గజ్జగానిపల్లెకు చెందిన రామన్న కుమారుడు సుబ్రహ్మణ్యం (24), పేద్రాజుపల్లెకు చెందిన భాస్కర్ కుమారుడు లోకేశ్ (25) డిగ్రీ పూర్తి చేసుకుని నాలుగు నెలల క్రితం ఉద్యోగం కోసం బెంగళూరు వెళ్లారు. వీరు ముగ్గురు నాలుగు నెలలుగా ఉద్యోగాన్వేషణలో ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో గురువారం ముగ్గురూ బెంగళూరులోని కేఆర్‌పురం రైల్వేస్టేషన్ సమీపంలో మృతి చెందినట్లు కుటుంబసభ్యులకు కర్ణాటక పోలీసులు సమాచారం అందించారు. ఇది విన్న కుటుంబీకులు దిగ్భ్రాంతికి గురయ్యారు. అయితే యువకుల మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. కర్ణాటక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. మృతదేహాలను రామసముద్రం తీసుకురావడానికి బాధిత కుటుంబ సభ్యులు బెంగళూరుకు వెళ్లినట్లు తెలిసింది.



పుష్కరిణిలో స్నానాలాచరిస్తున్న భక్తులు



ధ్వజావరోహణం కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

కోదండరాముడికి చక్రస్నానం

- రాత్రి ధ్వజావరోహణంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు

ఒంటిమిట్ట, ఏప్రిల్ 25: కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన గురువారం ఆలయ సమీపంలోని పుష్కరిణిలో చక్రస్నానం నేత్రపర్వంగా నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని పుణ్యస్నానాలు ఆచరించారు. ఆలయంలో ఉదయం 4 గంటలకు సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి ఆలయ శుద్ధి, ఆరాధన నిర్వహించారు. ఉదయం 9.30 గంటలకు లక్ష్మణ సమేత సీతారాముల వారు తిరుచ్చిలో సుదర్శనచక్రతాళ్వార్ పల్లకిలో ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు వేంచేశారు. ఉదయం 10.30 నుంచి 11.15 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు వేడుకలు, స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో సీతారామలక్ష్మణ సరసన చక్రతాళ్వార్‌లు పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనంతో అభిషేకాలు అందుకున్నారు. అనంతరం అర్చకుల వేదమంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. రాత్రి టీటీడీ అర్చకులు, వేద పండితులు శాస్త్రోక్తంగా ధ్వజారోహణం నిర్వహించారు. కోదండరామస్వామి వారి బ్రహ్మోత్సవాలు గురువారం సాయంత్రంతో ముగియనున్నారు.





కోదండరాముడికి చక్రస్నానం చేయిస్తున్న దృశ్యం



ఉద్దండుల అడ్డా.. మదనపల్లె గడ్డ..

● ప్రశాంత రాజకీయాల ఆలయం... ఆహ్లాదానికి నిలయం





మదనపల్లె, ఏప్రిల్ 25: జిల్లాలో ప్రశాంత, ఆహ్లాద వాతావరణానికి మారుపేరుగా నిలిచిన మదనపల్లె.. రాజకీయాల్లో కూడా అదే ముద్ర వేసుకుంది. రాజకీయ చైతన్యం గల మదనపల్లె నియోజకవర్గంలో ఎన్నికల వరకే పార్టీలు, వర్గాలు ఉన్నా.. తర్వాత నాయకులంతా పార్టీలకతీతంగా స్నేహపూర్వకంగా ఉండటం ఇక్కడి ప్రత్యేకత. ఇక్కడి రాజకీయ ఉద్ధండుల్లో ముఖ్యంగా కమ్యూనిస్టు యోధుడు దొడ్డా సీతారామయ్య, ఆలూరి నరసింగరావు, ఆవుల మోహన్‌రెడ్డిలు రాజకీయ ప్రముఖులు. అవిభక్త మద్రాస్ రాష్ట్రం నుంచి విడిపోయి..ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన అనంతరం ఏర్పాటైన మదనపల్లె నియోజకవర్గానికి 1952 నుంచి ఇప్పటి వరకూ 15 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఇందులో కాంగ్రెస్ ఆరుసార్లు, టీడీపీ అయిదుసార్లు, సీపీఐ రెండుసార్లు, వైసీపీ రెండుసార్లు విజయం సాధించాయి. దొడ్డా సీతారామయ్య రెండుసార్లు గెలుపొందగా, ఆలూరి నరసింగరావు, రాటకొండ నారాయణరెడ్డి మాత్రం వరుసగా రెండుసార్లు గెలుపొందారు. తంబళ్లపల్లె మండలం రేణుమాకులపల్లెకు చెందిన ఆవుల మోహన్‌రెడ్డి 1978లో తంబళ్లపల్లె నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున మొదటిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నిక కాగా, 1989లో మదనపల్లె నుంచి విజయం సాధించారు. టీడీపీ ఆవిర్భావం తర్వాత కాంగ్రెస్ పార్టీ రెండుసార్లు గెలవగా, టీడీపీ అయిదుసార్లు విజయం సాధించింది. టీడీపీ నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించిన రాటకొండ నారాయణరెడ్డి, 1994లో గెలిచిన రాటకొండ సాగర్‌రెడ్డి, 1999లో ఎమ్మెల్యేగా ఎన్నికైన రాటకొండ శోభ సమీప బంధువులు. రాటకొండ నారాయణరెడ్డి, సాగర్‌రెడ్డి పెదనాన్న కుమారుడు కాగా, రాటకొండ శోభ..స్వయానా తమ్ముడి భార్య కావడం విశేషం.

నియోజకవర్గ నేపథ్యం..

మొదట్లో మదనపల్లె, తంబళ్లపల్లె తాలూకాల పరిధిలోని మదనపల్లె పంచాయతీ, ప్రస్తుతం మండలాలుగా పిలుస్తున్న మదనపల్లె, నిమ్మనపల్లె, కురబలకోట, బి.కొత్తకోట, తంబళ్లపల్లె తాలూకాలోని తంబళ్లపల్లె, ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం, పెద్దమండ్యంలు ఉండేవి. 2009 పునర్విభజనలో మదనపల్లె నియోజకవర్గానికి మదనపల్లె మున్సిపాలిటీ, మదనపల్లె, నిమ్మనపల్లె, అప్పటి పుంగనూరు నియోజకవర్గంలోని రామసముద్రం మండలాన్ని కలిపి మదనపల్లె నియోజకవర్గంగా ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో మదనపల్లెలోని కురబలకోట, బి.కొత్తకోట మండలాలను తంబళ్లపల్లె నియోజకవర్గంలో కలిపేశారు.

రాజకీయ ప్రముఖుల గురించి..

● నియోజకవర్గం ఆవిర్భవించిన మొదటిసారి 1952లో మదనపల్లెకు చెందిన ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు దొడ్డా సీతారామయ్య ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌పై విజయం సాధించారు. సాదాసీదాగా ఉండే సీతారామయ్య నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ పేదలకోసం పోరాటాలు చేశారు. ఎమ్మెల్యే హోదాలోనూ పేదల గుడిసెల్లో బసచేసే ఆయన రాగిసంగటి, చింతపులుసు, వేరుశనగ పచ్చిడిని ఇష్టపడేవారు. తాను పడుకునేందుకు ఈతచాప, సాహిత్య పుస్తకాలను తన వెంట తీసుకెళ్లడం ఈయన ప్రత్యేకత. ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు.

● సామాన్య రైతు కుటుంబానికి చెందిన ఆవుల మోహన్‌రెడ్డి తంబళ్లపల్లె మండలం రేణుమాకులపల్లెకు చెందిన వారు. అప్పటి సీఎం మర్రి చెన్నారెడ్డికి శిష్యుడు. మర్రి చెన్నారెడ్డి ఆవుల మోహన్‌రెడ్డిని దత్తపుత్రుడిగా పరిగణించేవారు. మర్రి చెన్నారెడ్డితో ఉన్న సాన్నిహిత్యంతో రెండోసారి కాంగ్రెస్ నుంచి టికెట్ దక్కించుకుని మదనపల్లె నుంచి పోటీచేసి గెలుపొందారు. ఆయన అండదండలతో నల్లారి కుటుంబానికి వ్యతిరేకంగా ఉన్న ఆవుల మోహన్‌రెడ్డి రాష్ట్ర హౌసింగ్‌బోర్డు ఛైర్మన్‌గా పనిచేశారు. విద్య, వైద్యం, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో ఆద్యునిగా పేరుపొందారు ఆవుల మోహన్‌రెడ్డి.

● ఆలూరి నరసింగరావు స్వగ్రామం బి.కొత్తకోట మండలం గట్టు. అందుకే ఈయనను గట్టు నరసింగరావుగా పిలుస్తారు. సమితి ప్రసిడెంట్‌గా రెండుసార్లు పనిచేశారు. మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు అండదండలతో కరువుకు నిలయమైన తంబళ్లపల్లెలో పెద్దేరు ప్రాజెక్టును నిర్మించారు. మదనపల్లె, తంబళ్లపల్లె రాజకీయాల్లో బలమైన కుటుంబం గట్టుది. అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ప్రధాన అనుయాయుల్లో గట్టు ఒకరు. టి.ఎన్.కుటుంబం అండదండలున్నాళ్లూ అటు తంబళ్లపల్లె, ఇటు మదనపల్లెలో రాజకీయాల్లో రాణించారు.

సంవత్సరం	గెలుపు	ప్రత్యర్థి
1952	డి.సీతారామయ్య (సీపీఐ)	జి.శ్రీనివాసరెడ్డి (ఇండిపెండెంట్)
1955	టీజీకే గుప్త(కాంగ్రెస్)	డి.సీతారామయ్య(సీపీఐ)
1962	డి.సీతారామయ్య (సీపీఐ)	ఎన్ఆర్ కృష్ణయ్య (కాంగ్రెస్)
1967	గట్టు నరసింగరావు (కాంగ్రెస్)	ఆర్.రంగారెడ్డి (ఇండిపెండెంట్)
1972	గట్టు నరసింగరావు (కాంగ్రెస్)	ఎంఈ రెడ్డి (బీజేఎస్)
1978	జీవీ నారాయణరెడ్డి (కాంగ్రెస్)	సుంకు బలరాం(జనతా)
1983	ఆర్.నారాయణరెడ్డి (టీడీపీ)	కేఎస్ రెడ్డి (కాంగ్రెస్)
1985	ఆర్.నారాయణరెడ్డి (టీడీపీ)	ఎ.సుబ్రహ్మణ్యం (కాంగ్రెస్)
1989	ఆవులమోహన్‌రెడ్డి (కాంగ్రెస్)	ఆర్.నారాయణరెడ్డి (టీడీపీ)
1994	ఆర్.సాగర్‌రెడ్డి (టీడీపీ)	అల్లూరి సుబ్రహ్మణ్యం (కాంగ్రెస్)
1999	ఆర్.శోభ (టీడీపీ)	జి.ముజీబ్‌హుస్సేన్ (కాంగ్రెస్)
2004	డి.రమేశ్ (టీడీపీ)	జి.రాందాస్‌చౌదరి(ఇండిపెండెంట్)
2009	ఎం.షాజహాన్‌బాష (కాంగ్రెస్)	ఆర్.సాగర్‌రెడ్డి (టీడీపీ)
2014	దేశాయ్ తిప్పారెడ్డి (వైసీపీ)	చల్లపల్లె నరసింహారెడ్డి(టీడీపీ-బీజేపీ)
2019	ఎం.నవాజ్‌బాషా (వైసీపీ)	దొమ్మలపాటి రమేశ్ (టీడీపీ)

రాజకీయాలను ప్రభావితం చేసే అంశాలు..

మదనపల్లె నియోజకవర్గంలోని మదనపల్లె మున్సిపాలిటీ, మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాలు ఉన్నాయి. పట్టణంలో సుమారు 50 వేలకుపైగా ముస్లిం సామాజిక వర్గం ఓట్లు ఉన్నాయి. తర్వాత బలిజ సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు అధికంగా ఉన్నారు. వీరు ఆదరించిన పార్టీ గెలుస్తుందనడంలో సందేహం లేదు.

● వాయిస్ ఉంది.. ఓట్లు లేవు



చాలా మంది నాయకులకు వాయిస్ ఉంది కాని ఓట్లు లేవు. సభలు, సమావేశాలల్లో పాల్గొనే నాయకులు కొంతమంది వినసొంపుగా మాట్లాడుతుంటారు. తమ మాటల గారడీతో నాయకులు, కార్యకర్తల దగ్గర చప్పట్లు కొట్టించుకుంటారు. కానీ వీరికంటూ ఓటు బ్యాంకు ఉండదు. పట్టుమని పది ఓట్లు కూడా వీరు వేయించలేరు. ఉత్త మాటలతో కొంతమంది నేతలు ఎన్నికల్లో లబ్ధి పొందుతుంటారని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. ఇలాంటి వారి మాటలను నమ్ముకుంటే ఏ పార్టీ వారైన గట్టెక్కేది కష్టమని అంటున్నారు. - రైల్వేకోడూరు

● కోవర్టులున్నారు.. జాగ్రత్త




ప్రస్తుత అన్ని పార్టీ ల్లో కోవర్టులు ఉన్నారు. వీరితో పార్టీని ముందుకు నడిపించే వారు జాగ్రత్త గా వ్యవహరించాల్సి ఉంటుంది. ఇక్కడి మాటలు, అక్కడి మాటలు ఇక్కడ కోవర్టులు చెబుతుంటారు. ఇద్దరి దగ్గర పైసలు లాగుతుంటారు. ఎన్నికలు వచ్చాయంటే కోవర్టులు వాలిపోతారు. దీనిపై పార్టీని నడిపించే వారు గుర్తించ లేకపోతున్నారని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. పార్టీ జెండాలను పట్టుకున్న వారి కంటే కోవర్టులు ఎక్కువగా లబ్ధి పొందుతున్నారు.

జెండా పట్టుకో.. రూ.500 తీసుకో..



ఏ పార్టీ లోనైనా జెండా పట్టుకుని ప్రచారానికి వెళితే రూ.500లు ఇస్తున్నారు. కూలీ, నాలీ పనులు చేసుకునే వారు ఎక్కువగా ప్రచారాల్లో కనిపిస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి ప్రచారం చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం బుక్ పెట్టుకుని పేర్లు రాసుకుంటారు. జెండాలు, వాటికి కట్టెలు తదితరాలు ఇస్తారు. సాయంత్రం వాటిని వెనక్కి తీసుకుని మళ్లీ ఉదయం ఇస్తారు. ప్రతి రోజు కూలీ మాదిరిగా రూ.500లు ఇచ్చేస్తారు. రోజూ అన్ని పార్టీల్లో ఈ తంతు జరుగుతోంది.

● మాటలు చెప్పే వారికే ప్రాధాన్యత



పార్టీల్లో కమ్మని మాటలు చెప్పే వారికే నాయకులు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారు. వారి వల్ల పార్టీకి ఒరిగేది ఏమి ఉండదు. మాటకారులు నాయకులు నాలుగు మాటలు చెప్పి కాసులు తీసుకుని లబ్ధి పొందుతున్నారు. ఇవి అన్ని పార్టీల్లోను జరుగుతు న్నాయి. పార్టీ కోసం నిరంతరాయంగా కష్టపడి పనిచేసే వారికి ప్రయోజనం లేకపోగా కమ్మని మాటలు చెప్పిన వారికి ప్రాధాన్యత ఇస్తున్నారని రాజకీయ నిపుణులు అంటున్నారు.

కలగా మారిన టమోటా మార్కెట్

● ఎన్నికల ముందు హామీలు
● ఎన్నాళ్లు చెబుతారు అబద్దాలు
● 15 ఏళ్లుగా దేవపట్ల టమోటా మార్కెట్ కోసం ఎదురుచూపులే

సంబేపల్లె, ఏప్రిల్ 25: జిల్లాలో రాయచోటి నియోజకవర్గ కరువు పీడిత ప్రాంతం. ఈ ప్రాంతంలో రైతులు ఎక్కువగా టమోటా పంట సాగు చేస్తున్నారు. ధరలు ఉంటే దిగుబడి ఉండదు. దిగుబడి ఉంటే ధర ఉండదు. రైతు పండించిన పంట దాచుకోవడానికి కోల్డ్ స్టోరేజ్ లేవు. ప్రతియేటా రైతులకు నష్టాలు తప్పడం లేదు. 2009 ఎన్నికలు వచ్చినప్పుడు రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి దేవపట్లలో టమోటా రైతుల ప్రయోజనం కోసం టమోటా మార్కెట్, కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేస్తామని శిలాఫ లకాలు ఏర్పాటు చేశారు. అప్పటి కేంద్ర ఉక్కు సహాయం మంత్రి సాయిప్రతాప్ చేతుల మీదుగా శిలాఫలకాన్ని ప్రారంభించారు. నాయకులు ఇచ్చిన వాగ్దానం 15 ఏళ్ల అవుతున్నా ఇప్పటికీ రైతులకు కలగానే మారింది. 2009, 2014, 2019 ఎన్నికలు వచ్చినప్పుడు నాయకుల హామీలు అన్నీ అబద్ధాలే అని ప్రజలు భావిస్తు న్నారు. రాయచోటి నియోజకవర్గంలో సంబేపల్లె, చిన్నమండెం మండలాల్లో ఎక్కువగా టమోటా సాగు చేస్తున్నారు. ఒకప్పుడు సంబేపల్లె మండలం దేవపట్లలో టమోటా మార్కెట్ నిర్వహించేవారు. టమోటా బుట్టలతో, ఎడ్ల బండ్లతో జాతీయ రహదారిపై టమోటా రైతులు కిక్కిరిసి ఉండేవారు. మార్కెట్ జాతరను తలపిస్తూ ఉండేది. ఇక్కడి ప్రాంత రైతులకు టమోటా వ్యాపారం అనువుగా ఉండేది. ఢిల్లీ, ముంబై, మహారాష్ట్ర, చిత్తూరు ఆర్కాడ్ తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చేవారు టమోటా ధరలు నిలకడ లేకపోవడంతో టమోటా రైతులు నష్టాల బాట తప్పేది కాదు. అప్పట్లో టమోటా రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని టమోటా మార్కెట్‌కు స్థలాన్ని ఇచ్చేందుకు దాతలు ముందుకు వచ్చారు. 0.95 సెంట్లు స్థలం గ్రామ పంచాయతీకి ఇచ్చారు. 30-10-2009లో అప్పటి కేంద్ర ఉక్కు సహాయ మంత్రి సాయిప్రతాప్ చేతుల మీదుగా దేవపట్ల గ్రామ పంచాయతీ మార్కెట్ ప్రారంభోత్సవం చేపట్టారు. అనంతరం దాని గురించి పట్టించుకునేవారు లేరు. గత 15 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో మార్కెట్ ఏర్పాటు చేయకపోవడంతో టమోటా రైతులకు కష్టాలు తప్పడం లేదు. ధరల నియంత్రణపై టమోటా రైతులు ఆదుకునేందుకు ఈ రెండు మండలాలకు సంబంధించి ఒక కోల్డ్ స్టోరేజ్ నిర్మాణాన్ని చేపట్టేందుకు హామీ ఇచ్చారు. ఇప్పటికీ నేతలు ఇచ్చిన హామీలు నీటి మీద రాతలు గానే ఉన్నాయి. అయితే 15 సంవత్సరాల నుంచి టమోటా మార్కెట్ ఈ ప్రాంతం నుంచి కలకడ మండలానికి తరలిపోయింది. దీంతో ఈ ప్రాంత టమోటా రైతుల సమస్యలు తప్పడం లేదు. దీంతో ఖర్చు, భారంతో పాటు వ్యయ ప్రయాసలు తప్పడం లేదంటున్నారు టమోటా రైతులు.

దేవపట్లలో టమోటా మార్కెట్ ఏర్పాటు ఇంకెన్నాళ్లు



సంబేపల్లె, చిన్నమండెం మండల ప్రాంత రైతులకు దేవపట్ల మార్కెట్ చాలా అనుకూలం. టమోటా మార్కెట్ తరలించేందుకు వాహనదారులు తక్కువ బాడుగ తీసుకునే వారు కమీషన్లు ఉండేవి కాదు. దేవపట్లలో టమోటా మార్కెట్ పెడితే బాగుంటుంది. 15 ఏళ్లుగా అబద్ధాలే చెబుతున్నారు. టమోటా మార్కెట్ ఏర్పాటు ఇంకెన్నాళ్లు.

- నాగిరెడ్డి, టమోటా రైతు, మాదంవాండ్లపల్లె, సంబేపల్లె మండలం



దేవపట్ల టమోటా మార్కెట్ కోసం దాతలు ఇచ్చిన స్థలంలో పిచ్చి మొక్కల మధ్య ఉన్న శిలాఫలకం

జిల్లా కంట్రోల్‌లో ఉంది

● కంట్రోల్ రూమ్ నుంచి ఫిర్యాదుల పరిష్కారం
● సమస్యాత్మక కేంద్రాల్లో ప్రత్యేక నిఘా
● ఇప్పటి వరకు 767 లైసెన్స్ వెపన్స్ స్వాధీనం
● జిల్లాలో 5276 మంది బైండోవర్
● జిల్లా మొత్తం 18 ఫ్లయింగ్ స్క్వాడ్‌తో తనిఖీలు



కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

రాయచోటి(కలెక్టరేట్), ఏప్రిల్ 25: సార్వత్రిక ఎన్నికలకు అధికారులు అన్ని రకాలుగా సిద్ధంగా ఉన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి జిల్లాలో జరిగే ప్రతి విషయంపైన తగిన చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా నలుమూలల నుంచి సీ-విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులను 90 నిమిషాలలోపే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అలాగే ఐటీ అప్లికేషన్‌పైన కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు. ఎంసీఎంసీ, కంప్లైంట్ మేనేజ్మెంట్, కమ్యూనిటీ సెల్ ద్వారా అందిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో ప్రత్యేకమైన మొబైల్ వాహనాలు పెట్టి జీపీఎస్ ద్వారా మానిటరింగ్ చేసే విధానం అందుబాటులోకి తీసుకొచ్చారు. జిల్లాలో చెక్ పోస్టు దగ్గర సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వెబ్‌కాస్ట్ ద్వారా మానిటరింగ్ చేసే విధానం అమలవుతోంది. అంతేగాకుండా రాజంపేట పార్లమెంట్ ఎక్స్పెండిచర్ మానిటరింగ్ సెల్, మానిటరింగ్ కంట్రోల్ రూమ్ కాల్ సెంటర్‌ని కూడా ఏర్పాటు చేశారు. ఎంసీఎంసీ టీంతో పాటు ప్రింట్ మీడియా మానిటరింగ్ కమిటీ సెల్, ఎలక్ట్రానిక్ మీడియా మానిటిరింగ్, సెల్ సోషల్ మీడియా మానిటరింగ్ సెల్ కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇవన్నీ కూడా 24/7 అందుబాటులో ఉండి నిరంతరం పనిచేస్తాయని అధికారులు వెల్లడించారు.

నిఘా నీడలో జిల్లా

అన్నమయ్య జిల్లాలో కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు దాదాపు 6 కోట్ల రూపాయల విలువ గల మద్యం, గంజాయి, నగదు పట్టుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇప్పటి వరకు జిల్లాలో 767 లైసెన్సులు తుపాకులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. సీఆర్‌పీసీ సెక్షన్ల కింద జిల్లాలో ఇప్పటి వరకు 828 కేసులు నమోదు చేశారు. జిల్లా మొత్తం 576 మందిని బైండోవర్ చేయడం జరిగిందని పోలీసులు మీడియా సమావేశంలో వెల్లడించారు. సెక్టోరల్ ఆఫీసర్ 42 మందితో పాటు జిల్లాలో చెక్‌పోస్టుల వద్ద దాదాపు 22 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిత్యం నిఘా పెట్టామని అధికారులు వెల్లడించారు.

కలెక్టరేట్‌లో ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూం ఏర్పాటు

జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసి నిత్యం జిల్లాలో జరుగుతున్న ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు కలెక్టర్ మీడియా సమావేశంలో వెల్లడించారు. కలెక్టరేట్‌లో ఎన్నికల విభాగం, ఎక్స్పెండిచర్ అబ్జర్వర్లు, ఎంసీఎంసీటీ ఎక్స్పెండిచర్ మానిటరింగ్ కంట్రోల్ రూం సెంటర్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా మానిటరింగ్ సెంటర్, వెబ్‌కాస్టింగ్ టీం, జీపీఆర్ఎస్ మానిటరింగ్ సెల్, రిపోర్టింగ్ మానిటరింగ్ సెల్‌తో కలిసి దాదాపు 2 0 0 మంది సిబ్బంది ఇక్కడ పనిచేస్తున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు నిత్యం కృషి చేస్తున్నారని అధికారులు తెలిపారు.



నామినేషన్ల కోసం పోలీస్ భద్రత ఏర్పాటు చేసిన దృశ్యం

చివరిరోజు నామినేషన్‌ల జోరు...

● రాజంపేట ఎంపీకి 18 మంది నామినేషన్లు

రాయచోటి (కలెక్టరేట్) ఏప్రిల్ 25: నామినేషన్లకు చివరి రోజైన గురువారం రాజంపేట ఎంపీ స్థానానికి వైసీపీకి చెందిన మిథున్‌రెడ్డి తరపున 4వ సెట్టు నామినేషన్ వేయగా, 17 మంది ఇదివరకు వేసినవారే మళ్లీ ఇండిపెండెంట్లుగా నామినేషన్ వేశారు. మదనపల్లిలో 7 మంది నామినేషన్లు వేశారు.

టీడీపీ1, వైసీపీకి 1, ఇండిపెండెంట్లు 5 మంది నామినేషన్లు వేశారు. రైల్వేకోడూరులో 15 మంది ఇండిపెండెంట్ అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు. పీలేరులో వైసీపీ తరపున చింతల రామచంద్రారెడ్డి సతీమణి నామినేషన్ వేయగా మిగిలిన నలుగురు ఇండిపెండెంట్లుగా నామినేషన్‌లు వేశారు. తంబళ్లపల్లెలో పెద్దిరెడ్డి వెంకట అభినయ్‌రెడ్డి వైసీపీ తరఫున నామినేషన్ వేయగా, దాసరిపల్లి జయచంద్రారెడ్డి టీడీపీ తరఫున మరో సెట్టు నామినేషన్ వేశారు. మరో ముగ్గురు ఇండిపెండెంట్లుగా నామినేషన్ వేశారు.

రాజంపేటలో టీడీపీ తరుపున బాల సుబ్రమణ్యం 1 సెట్టు నామినేషన్ వేయగా, వైసీపీ తరఫున అకేపాటి అమర్‌నాథరెడ్డి నామినేషన్ వేశారు. వారితో పాటు మరో 8 మంది ఇండిపెండెంట్లుగా నామినేషన్ వేశారు. రాయచోటిలో కూడా 12 మంది ఇండిపెండెంట్లు నామినేషన్‌లు వేశారు.

ఎన్నికలపై ఫిర్యాదులు తెలపవచ్చు

ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు తమకు తెలియజేయవచ్చునని జిల్లాకు వచ్చిన ఎన్నికల పరిశీలకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓం ప్రకాష్ బంకర, కవిత ఎస్ మనికేరి, శాంతిభద్రతల పరిశీలకులు దిల్‌నవాజ్ అహ్మద్, ఎన్నికల వ్యయపరిశీలకులు రవీంద్రకుమార్, మరో ముగ్గురు ఐఆర్ఎస్ అధికారులు జిల్లాకు వచ్చారు. ఎన్నికలకు సంబంధించిన ఎటువంటి ఫిర్యాదులైనా అధికారుల ఫోన్ నెంబర్లు 8977946222, 8977948222, 89779949111, 89779947333 ద్వారా సమస్యలు తెలపవచ్చని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



శిథిలావస్థకు చేరిన సబ్‌రిజిస్ట్రారు కార్యాలయం

అభివృద్ధి అంటే ఇదేనా...?

- ముఖ్యమంత్రి హామీలు నీటి మూటలు
- 'మాట తప్పను మడమ తిప్పను' నినాదానికి తూట్లు



శతాబ్దం దాటిన తహసీల్దారు భవనం

- బద్వేలు రూరల్

'బద్వేలు నియోజకవర్గంలో రూ.500 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నాం అంటూ 2021 జూలై10న ఉప ఎన్నికల్లో సీఎం జగన్ ప్రకటించారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు రూ.500 కోట్ల అభివృద్ధి. అయితే జరిగిన పనులు రూ.47 కోట్లు మాత్రమే. ప్రతిపక్ష నేత హోదాలో చాంతాడంత హామీలు ఇచ్చినా సీఎం అయ్యాక ఐదేళ్ల ఏం చేయలేకపోగా మళ్లీ వైసీపీనే గెలిపించాలంటూ ఇంటింటి ప్రచారం చేస్తుండడం గమనార్హం. గోపవరం పక్కనే సోమశిల ప్రాజెక్టు నిర్మాణం కోసం గోపవరం మండలంలో ఊర్లన్నీ ఖాళీ చేయించారు. చెంతనే నీరున్నా చుక్క కూడా ఉపయోగించలేని దుస్థితి. సోమశిల నీటిని బద్వేలు పెద్దచెరువుకు నింపితే బద్వేలు, గోపవరం మండలాలకు సాగు, తాగునీటి సమస్య తీరుతుందని ఆ ప్రాంతీయులు ఆశించారు. సోమశిల నీటి కోసం ఆందోళనలు, పాదయాత్రలు, ఉద్యమాలు చేశారు. 2018లో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక జీఓ ఇచ్చారు. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు వచ్చాయి. ప్రతిపక్ష నేత హోదాలో జగన్ బద్వేలు నాలుగురోడ్ల కూడలి బహిరంగసభలో మాట్లాడుతూ మన ప్రభుత్వం వచ్చిన వెంటనే సోమశిల నుంచి 2 టీఎంసీలు కాదు 5 టీఎంసీల నీటిని ఇస్తానని జనం సాక్షిగా హామీ ఇచ్చారు. దీంతో గోపవరం, బద్వేలులో సుమారు 25వేల ఎకరాలకు నీరందుతుందని రైతులు సంతోషించారు. జగన్ హామీలకు సైతం మంగళం పాడితే అభివృద్ధి అంటే హామీలు ఇవ్వడం కాదు వాటిని అమలు చేయడమని బద్వేలు వాసులు మడ మ తిప్పిన జగన్‌కు తెలిపే యోచనలో ఉన్నారు.

తాను అధికారంలోకి వస్తే తాగు, సాగునీరు అన్నిరంగాల్లో బద్వేలు నియోజకవర్గాన్ని అభివృద్ధి పరుస్తానని ప్రతిపక్ష నేతగా 2019లో ఎన్నికల రోడ్‌షోలో హామీలు, ముఖ్యమంత్రి అయ్యాక ఉప ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నెల్లూరు బైపాస్ రోడ్డులో నిర్వహించిన బహిరంగ సభలో ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోక ఇచ్చిన హామీలు నీటిమూటలయ్యాయి. మాట తప్పం, మడమ తిప్పం నాదానికి తూట్లు పడ్డాయి.

2019 రోడ్‌షోలో ఇచ్చిన హామీలు

2019 ఎన్నికల ప్రచారంలో పట్టణంలోని నెల్లూరు రోడ్డులో నిర్వహించిన రోడ్‌షోలో సోమశిల వెనుక జలాల ద్వారా బద్వేలు, గోపవరం, అట్లూరు మండలాలకు సాగునీరందిస్తామని ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదు. సోమశిల వెనుకజలాల ఎత్తిపోతల పథకం నిర్మించినట్లయితే బద్వేలు, గోపవరం, అట్లూరు మండలాల్లోని రైతాంగానికి సాగునీరు అంది చాలా మటుకు రైతాంగ సమస్యలు పరిష్కారం అవుతాయి. అయినా ఆ హామీని నిలబెట్టుకోలేకపోయారు.

2021 సభలో ఇచ్చిన హామీలు

2021 ఉప ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పట్టణంలోని పోరుమామిళ్ల బైపాస్ రోడ్డులో నిర్వహించిన బహిరంగసభలో కుందూ నది వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రారంభించి ఆ నీటిని బ్రహ్మంసాగర్‌కు అందిస్తామని ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. కొంత మేర పనులు ప్రారంభమైనప్పటికీ ఆ పనులు ప్రస్తుతం నిలిచిపోయాయి. దీంతో కుందూ లిఫ్ట్ ఇరిగేషన్ హామీ నీటిమూటగా మారింది. అలాగే ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి బద్వేలులో శిథిలా వస్థకు చేరుకున్న తహసీల్దారు కార్యా లయం, సబ్ రిజిస్ట్రారు కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం నూతన భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని అడిగారని, రూ.15 కోట్లు నూతన భవనాలకు నిధులు మంజూరు చేస్తున్నామని హామీ ఇచ్చారు. మరి ఆ హామీ ఇంత వరకూ అమలు కాలేదు. ఎప్పుడూ ప్రస్తావనకు కూడా రాలేదు. దీంతో ముఖ్య మంత్రి హోదాలో జగన్ ఇచ్చిన చాలా హామీల్లో అమలుకు నోచుకోని విధంగానే బద్వేలుకు ఇచ్చిన హామీ కూడా అమలుకు నోచుకోలేక పోయాయి.

శతాబ్దం దాటిన రెండు భవనాలు

బద్వేలు తహసీల్దారు కార్యాలయానికి శతాబ్ద కాలం పూర్తయింది. దాదాపు 1900లో నిర్మించినట్లుగా చెబుతున్న కార్యాలయం శిథిలావస్థకు చేరింది. 1894లో నిర్మించిన సబ్ రిజిస్ట్రారు కార్యాలయ పరిస్థితి కూడా అలాగే ఉంది. మిగా అభివృద్ధి పనుల మాట ఎలా ఉన్నా ఈ రెండు భవనాలు శతాబ్ద కాలం దాటింది కనుక నూతన భవనాలు నిర్మించాల్సి ఉంది. ముఖ్యమంత్రి హామీ ఇచ్చినప్పటికీ ఈ రెండు కార్యాలయాల నూతన భవనాలకు నిధులు మంజూరు కాలేదు. అధికారులు, ప్రజలు అలాగే కాలం వెల్లదీస్తున్నారు.

ప్రతిపక్ష, సీఎం హోదాలో జగన్ ఇచ్చిన హామీలు

- బద్వేలులో కూరగాయల మార్కెట్, పార్కులు, శ్మశానాల అభివృద్ధికి ఇచ్చిన హామీలు పూర్తి కాలేదు.
- నాగులచెరువును సుందరీకరణ చేపడతామన్న హామీ సైతం అటకెక్కించారు.
- పోరుమామిళ్లలో రూ.25 కోట్లతో రోడ్ల విస్తరణ పనులు చేపట్టినా అవి ముందుకు సాగడంలేదు.
- కాశినాయన మండలంలో 22 దేవాలయాలకు నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేస్తామన్న హామీ నెరవేరలేదు.
- శిథిలావస్థకు చేరుకున్న బి.కోడూరు మండలం సగిలేరు గురుకుల పాఠశాలకు అదనపు గదులు ఇస్తామని హామీ నేటికీ అలాగే నిలిచిపోయింది.
- బికోడూరు మండలం గోవిందాయపల్లెలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.
- అట్లూరు మండలం వేమలూరు సగిలేరు మధ్య రూ.22 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి సీఎం జగన్ వేసిన శిలాఫలకం అలాగే నిలిచిపోయింది.
- కుడికాల్వ పనులు పూర్తి చేసి అట్లూరుకు తెలుగంగ నీరు అందిస్తామని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు.
- కలసపాడు నుంచి బ్రాహ్మణపల్లెకు వెళ్లే దారిలో సగిలేరు వంతెనపై రూ.9.5 కోట్లతో నిర్మించే బ్రిడ్జికి సీఎం జగన్ ఉప ఎన్నికల సందర్భంగా శంకుస్థాపన చేశారు. హామీ శిలాఫలకాలకే పరిమితమైంది.
- వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కలసపాడు, కాశినాయన, పోరుమామిళ్ల మండలాల్లో 25వేల ఎకరాలకు సాగు, తాగునీరు అందించేందుకు ఆ ప్రాజెక్టు డిజైన్ చేశారు. ఇంత వరకూ అది కార్య రూపం దాల్చలేదు.
- తెలుగుగంగ ప్రాజెక్టు పిల్ల కాల్వలు, ఇతర పనులు పూర్తి కాకపోవడంతో చివరి ఆయకట్టుకు నీరందని పరిస్థితి కేవలం చెరువులు నింపి వాటి ద్వారా అందిస్తున్నారు.

కమలాపురంలో.. రెడ్లదే హవా

- 15 సార్లు ఎన్నికలు
- 14 సార్లు వాళ్లే
- హ్యాట్రిక్ లభించని నేతలు
- ఈ సారి అభ్యర్థి నిర్ణయం మహిళల చేతుల్లోనే




నర్రెడ్డి శివరామిరెడ్డి, మొట్టమొదటి ఎమ్మెల్యే

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 25: కమలాపురం నియోజకవర్గానికి జిల్లాలో విశిష్ట స్థానం ఉంది. ఎందరో ఉద్ధండులను కమలాపురం శాసనసభ స్థానానికి ఎంపిక చేసిన ఓటర్లు మొట్టమొదటి విజయాన్ని భారత కమ్యూనిస్టు పార్టీకి అందించారు. 1951లో ఏర్పాటైన నియోజకవర్గంలో ఇప్పటి వరకు 15 సార్లు ఎన్నికలు జరిగాయి. ఇందులో రెడ్డి కులానికి చెందిన వారు 14 సార్లు గెలవగా, ఒకే ఒక్క సారి రెడ్డియేతర అభ్యర్థి గెలవడం గమనార్హం. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో టీడీపీ, వైసీపీ అభ్యర్థులుగా రెడ్డి సామాజిక వర్గం పోటీలో ఉండగా సీపీఐ నుంచి రెడ్డియేతర అభ్యర్థి పోటీలో ఉన్నారు. సీపీఐ అభ్యర్థికి కాంగ్రెస్ మద్దతు ప్రకటించింది.

తొలి ఎమ్మెల్యేగా ఎన్.శివరామిరెడ్డి

1951లో కమలాపురం నియోజకవర్గం ఏర్పడింది. తొలిసారిగా 1952లోఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థిగా నర్రెడ్డి శివరామిరెడ్డి పోటీ చేసి తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి రామలింగారెడ్డిపై విజయం సాధించారు. తొలి కమలాపురం నియోజకవర్గం ఎమ్మెల్యేగా నమోదయ్యారు. ఆ ఎన్నికల్లో 5304 ఓట్లు సాధించారు.

పదిహేను సార్లు ఎన్నికలు



నియోజకవర్గంలో 15 పర్యాయాలు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, కాంగ్రెస్-ఐ అభ్యర్థులు 8సార్లు విజయం సాధించగా, రెండు సార్లు టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారు. ఒకసారి సీపీఐ, రెండు సార్లు ఇండి పెండెంట్లు, రెండు సార్లు వైసీపీ అభ్యర్థులు గెలుపొందారు. అయితే 1967లో ఇండి పెండెంట్ అభ్యర్థి పుల్లారెడ్డి సమీప కాంగ్రెస్ అభ్యర్థి వడ్డమాను వెంకటరెడ్డిపై 86 ఓట్ల అత్యల్ప ఆధిక్య తతో విజయం సాధించారు.

అభ్యర్థిని నిర్ణయించేది మహిళలే...

కమలాపురం నియోజకవర్గంలో 2024ఎన్నికల్లో అభ్యర్థిని నిర్ణయించేది మహిళా ఓటర్లే అని చెప్పాలి. నియోజకవర్గంలో 203536 మంది ఓటర్లుండగా, వీరిలో 99553 మంది పురుషులు ఓటర్లు, మహిళలు 1,03,949 మంది, థర్డ్ జండర్ 34 మంది అయితే అత్యధికంగా ఉన్న మహిళా ఓటర్లు కమలాపురం ఎమ్మెల్యే అభ్యర్థిని నిర్ణయించే అవకాశాలున్నాయి.

మండలాలు

నియోజకవర్గంలో ఆరు మండలాలున్నాయి. కమలాపురం, సీకే దిన్నె, చెన్నూరు, పెండ్లిమర్రి, వల్లూరు, వీఎన్‌పల్లె.

2004 నుంచి ఎన్నికల సరళి

2004లో జి.వీరశివారెడ్డి టీడీపీ తరపున ఎన్నికై కాంగ్రెస్‌లోకి మారారు. కాంగ్రెస్ తరపున పోటీ చేసి ఓడిపోయిన పుత్తా నరసింహారెడ్డి టీడీపీలోకి మారారు. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున జి.వీరశివారెడ్డి పోటీ చేసి తన సమీప ప్రత్యర్థి పుత్తా నరసింహారెడ్డిపై 4163 ఓట్ల మెజార్టీతో గెలిచారు. 2014 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి రవీంద్రనాథరెడ్డి తన సమీప టీడీపీ అభ్యర్థి పుత్తా నరసింహారెడ్డిపై 5345 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 2019లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి పి.రవీంద్రనాథరెడ్డి తన సమీప టీడీపీ అభ్యర్థి పుత్తా నరసింహారెడ్డిపై 27,333 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 2024లో వైసీపీ తరపున పి.రవీంద్రనాథరెడ్డి, టీడీపీ అభ్యర్థిగా పుత్తా చైతన్యరెడ్డి, సీపీఐ అభ్యర్థిగా గాలిచంద్ర పోటీలో ఉన్నారు.

1952 నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు

1952	నర్రెడ్డి శివరామిరెడ్డి, సీపీఐ
1955	ఎం.శంభురెడ్డి, కాంగ్రెస్
1962	వి.వెంకటరెడ్డి, కాంగ్రెస్
1967	ఎన్.పుల్లారెడ్డి , స్వతంత్ర
1972	ఆర్‌సీతారామయ్య, కాంగ్రెస్
1978	పేర్ల శివారెడ్డి, స్వతంత్ర
1983	జి.వెంకటరెడ్డి, టీడీపీ
1985	ఎంవీ మైసూరారెడ్డి, కాంగ్రెస్
1989	ఎంవీ మైసూరారెడ్డి, కాంగ్రెస్
1994	జి.వీరశివారెడ్డి, టీడీపీ
1999	ఎంవీ మైసూరా రెడ్డి, కాంగ్రెస్
2004	వీరశివారెడ్డి, టీడీపీ
2009	వీరశివారెడ్డి, కాంగ్రెస్
2014	పి.రవీంద్రనాథరెడ్డి, వైసీపీ
2019	పి.రవీంద్రనాథరెడ్డి, వైసీపీ

పోలింగ్ విషయాలు తెలుసుకోండి....

చెన్నూరు, ఏప్రిల్ 25: ఏ కారణంతోనైనా పోలింగ్ ప్రారంభం కావడం ఆలస్యమైతే పోలింగ్ సమయం పెంచరు. నిర్ణీత సమయానికి క్యూలైనులో ఉన్న వారికి ఓటు వేసేందుకు అనుమతిస్తారు. ఎంత రాత్రి అయినా సరే వారంతా ఓటు వేసే వరకు పోలింగ్ కొనసాగుతుంది.

- పోలింగ్ కేంద్రంలో కానీ, కేంద్రానికి వంద మీటర్ల పరిధిలో కానీ అభ్యర్థి, మరే వ్యక్తి కూడా ఫలానా గుర్తు, వ్యక్తికి ఓటు వేయాలని ప్రచారం చేయడం శిక్షార్హం. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 130 ప్రకారం నేరం.
- గ్రామాలు, పోలింగ్ కేంద్రాల పరిధిలో ఏదైనా కారణాలతో ఓటింగ్ బహిష్కరిస్తే రీపోలింగ్ నిర్వహించరు.
- పోలింగ్ కేంద్రం పరిధిలో కానీ, వంద మీటర్ల దూరంలో కానీ అభ్యర్థి మీడియాతో మాట్లాడకూడదు. అది చట్టరీత్యా నేరం.
- పోలింగ్ కేంద్రంలోకి వెళ్లడానికి గన్‌మెన్‌కు అనుమతిలేదు. ఒకవేళ ఓటు వేసేందుకు గన్‌మెన్ వస్తే తన ఆయుధాన్ని బయట ఉన్న పోలీసుల వద్ద ఉంచి ఓటు వేసి తిరిగి వచ్చి తన ఆయుధాన్ని తీసుకోవాలి.
- ఓటు వేసేటపుపడు ఫొటోలు తీయడం, వీడియో చిత్రీకరణ నేరం., ఇది రహస్య ఓటింగ్‌కు భంగం కలిగిస్తుంది.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 25: 18 ఏళ్లు నిండిన ప్రతి భారతీయ పౌరుడికీ ఓటు హక్కు రాజ్యాంగం ప్రసాదించింది. ప్రతి ఓటరూ తమ హక్కును వినియోగించుకోవాలి. ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్ మేధావులు, రాజకీయ పార్టీలు పదే పదే చెబుతుంటాయి. ఒక్కో నియోజకవర్గంలో చాలా మంది ఎన్నికల బరిలో ఉంటారు. అభ్యర్థులకు ఓటు వేయడం ఇష్టం లేకపోతే చివరి వరుసలో ఉన్న నోటా బటన్ నొక్కితే సరిపోతుంది. 2014 సార్వత్రిక ఎన్నికల్లో మొదటిసారిగా కేంద్ర ఎన్నికల సంఘం నోటాకు అవకాశం కల్పించింది.

ప్రచార రథాల జోష్

- ఊరూవాడా హల్‌చల్
- తెల్లవారే సరికే గ్రామాల్లో ప్రత్యక్షం
- ఎన్నికల ప్రచారంలో కీలకపాత్ర



కడప (రూరల్), ఏప్రిల్ 25: దేశంలోనే ఎన్నడూ లేనివిధంగా 2019 సుదీర్ఘ ఎన్నికల సమరానికి ఎన్నికల కమిషన్ శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ఏపీలో ఏంపీ, ఎమ్మెల్యే నాలుగో విడత ఎన్నికలకు ఏప్రిల్ 18న నోటిఫికేషన్ జారీ చేసింది. 25 వరకు నామినేషన్లు, 29 వరకు ఉపసహరణ, మే 13న పోలింగ్ జరగనుంది. 2024 ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలు ఆయా పార్టీల భవితవ్యాన్ని నిర్ణయించేవి కావడంతో గేలుపే ధ్యేయంగా పావులు కదుపుతున్నాయి. ఇందులో గెలుపే ప్రధాన కారణాల్లో ప్రచారం ఒకటి కావడంతో పార్టీల అధినాయకులు, అభ్యర్థులు ఓటర్లను అకట్టుకునే ప్రచారానికి తెరలేపారు. ప్రచారంలో తామే ఒకడుగు ముందుండాలనే భావనతో ప్రచార అర్భాటానికి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నారు. అన్ని పార్టీల అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో ఓటర్లను అకట్టుకునే విధంగా పార్టీల ప్రచార వాహనాలను అందంగా తయారు చేసి ప్రచారంలోకి దింపారు. ఉమ్మడి కడప జిల్లాలోని కడప నియోజక వర్గం సహా మైదుకూరు, పొద్దుటూరు, జమ్మలమడుగు, కమలాపురం, పులివెందుల, రాయచోటి, రైల్వేకోడూరు, రాజంపేట, బద్వేలు నియోజకవర్గాల్లో ఒక్కో పార్టీ నుంచి అధిక సంఖ్యలో సంచార వాహనాల్లో ప్రచారం చేస్తూ తమ పార్టీ గుర్తుకే ఓటువేయాలని ఓటర్లను చైతన్యపరిచే గీతాలతో హల్‌చల్ చేస్తున్నాయి. దీంతో అభ్యర్థుల ప్రచారంలో ప్రచార వాహనాలు స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తున్నాయి. తెల్లవారే సరికే గ్రామాల్లో ప్రచార రథాలు దర్శనమిస్తూ సుప్రభాత గీతంలా అభ్యర్థుల గురించి ఘనంగా చెప్పుతూ హోరెత్తిస్తున్నా యి. ఆయాపార్టీల రంగులు పులుముకొని, పోటీచేసే అభ్యర్థులు, అధినేత ఫొటోలు, గుర్తులతో అందంగా అలంకరించిన ప్రచార రథాలు ఊరూవాడా తిరుగుతూ ఎన్నికలకు కళ తెస్తున్నాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులే కాకుండా స్వతంత్ర అభ్యర్థులు సైతం ప్రచారం రథాలతో ఎన్నికల రణ క్షేత్రంలో హోరెత్తిస్తున్నాయి. అభ్యర్థులకంటే ముందే ప్రచార రథాలు నియోజకవర్గాలను చుట్టివస్తూ ప్రచారానికి జోష్ కల్పిస్తున్నాయి. జనసంచారం ఉంటున్న కూడళ్లలో ప్రచార రథాలు ప్రజ లనుఉత్తేజపరిచి చైతన్యం నింపే పాటలు, అధినేత ప్రసంగాలతో హంగామా చేస్తున్నాయి. ఎన్నికలంటేనే ప్రచారం అన్నట్లుగా ఆయా ప్రచార రథాలను అన్ని పార్టీల అభ్యర్థులు, అన్ని హంగులతో తయారు చేసి క్షేత్రస్థాయిలో తిప్పుతూ గ్రామీణ రోడ్లపై పరుగులు తీయిస్తున్నారు.



కడప నగరంలో పోటాపోటీగా

కడప నగరంలో ఎన్నడూ లేనిరీతిలో ఆయా పార్టీల అభ్యర్థులు 2024 సాధారణ ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. టీడీపీ, బీజేపీ, జనసేనలు ఎన్డీయే కూటమి గాను, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎంలు ఒక కూటమి, వైఎస్ఆర్‌సీపీ త్రికోణ ప్రచారాలను సాగిస్తున్నారు. పార్టీల అభ్యర్థులు ప్రచార వాహనాలను ఆయా పార్టీల గుర్తులు, రంగులతో అందంగా అలంకరించి ప్రచారంలోకి దించారు. ఒక్కో పార్టీనుంచి ఐదారు వాహనాలదాకా ప్రచారంలోకి దిగడంతో ఏ కాలనీలో, ఏ వీధిలో చూసినా ప్రచార వాహనాల మోతే మార్మోగుతోంది. ఫలానా పార్టీ అభ్యర్థికి మీ అమూల్యమైన ఓట్లువేసి, వేయించి గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నాం అంటూ మైకు ద్వారా ఓటర్ల చెవుల్లో గింగుర్లు తిరిగేలా చేస్తున్నారు.

పొద్దుపొద్దున్నే గ్రామాల్లో

ఎన్నికల ప్రచార ముగింపు గడువు రోజురోజుకూ సమీపిస్తుండడంతో ప్రచారంలో కూడా అభ్యర్థులు కాస్త వేగం పెంచారు. గ్రామీణ ఓటర్లు నిద్రలేచి లేవంగానే పార్టీల పరచార రథాలు గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యక్షమవుతూ ప్రచార వాణిని వినిపిస్తున్నాయి. గ్రామాల్లో తిరుగుతూ ప్రచార రథాలు లనప్ర అకట్టుకుంటున్నాయి. అన్నిహంగులతో రూపొందించిన ఈ ప్రచార రథంలో కార్యకర్తలు లేకున్నా వాటిలో మైక్ సెట్లను ఏర్పాటుచేసి గ్రామాల్లోకి పంపిస్తున్నారు. ఇప్పటికే ప్రచార రథాలు అన్ని గ్రామాల్లోని వీధివీధినా ఒటికి రెండు సార్లు చుట్టేసి అభ్యర్థుల తరపున ప్రచారం చేస్తున్నాయి. అభ్యర్థులు ప్రచారానికి వెళ్లే గ్రామాల్లో అరగంట ముందే అక్కడికి ప్రచార రథాలు వెళ్లి జోష్ తెప్పిస్తున్నాయి. ప్రచార రథం ఉత్తేజ పరిచే పాటలతో జనాన్నికూడగడుతున్నా యి. త ద నం తరం అభ్యర్థి అక్కడికి వెళ్లి తమ ప్రచారాన్ని నిర్వహించి రక్తికట్టిస్తున్నారు. మొత్తానికి అభ్యర్థుల ప్రచార రథాలు ప్రచారంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని చెప్పవచ్చు



అభ్యర్థుల ఫొటోలతో ముస్తాబు

ప్రచార రథాలను పార్టీల రంగులతో అభ్యర్థుల ఫొటోలతో అందంగా ముస్తాబు చేశారు. రంగంలో ఉంటున్న పార్టీల అభ్యర్థులు ముందస్తుగానే వేలాది రూపాయలు వెచ్చించి ఈ ప్రచార రథాలను తయారు చేయించారు. వాహనాలకు అభ్యర్థుల కటౌట్లను ఏర్పాటుచేసి దానికే మైక్ సెట్లను అమర్చి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆయా పార్టీ అభ్యర్థులు తమ పార్టీ గర్తులను, రంగులను వేయించి వినూత్నంగా ప్రచార రథాన్ని తయారు చేసి ఎన్నికల క్షేత్రంలోకి వదిలారు.

ఓట్లులేకున్నా... రాయ'బేరాలు'

బిల్డప్ నేతల మాటలు ● లక్షలు ఇస్తే వస్తామంటూ రాయబారాలు



చెన్నూరు, ఏప్రిల్ 25: చెన్నూరు మండలం టీడీపీకి కంచుకోట. ఆది నుంచీ ఈ పార్టీకి కింది స్థాయిలో మంచి ఓటు బ్యాంకు ఉంది. ఇటీవల చిన్నపాటి ఇబ్బందులతో ప్రజలు కాసింత దూరమైనా ఇప్పుడు తిరిగి సైకిలు ఎక్కుతున్నారు. సైకిలు జోరు హుషారుగా ఉన్న ఈ సమయంలో ఎలాగైనా ఆ పార్టీ ద్వారా క్యాష్ చేసుకోవాలని కొందరు నేతలు ప్రయత్నిస్తున్నారు. అదే సమయంలో అధికార పార్టీ నేతల వద్ద సైతం తమకు ఓట్లు మస్తుగా ఉన్నాయి. మీ పార్టీలోకి వస్తే ఏం ఇస్తావు అంటూ రాయబేరాలు సాగిస్తున్నారు. ఇటు ఇరుపార్టీల వద్ద ఇదే విధంగా స్థానిక నేతలు కొందరు నెరుపుతున్నారు. మేం నియోజకవర్గ స్థాయిలో మా సత్తా చాటాం. జిల్లాస్థాయిలో పదవులు అనుభవిం చి మా సత్తా చాటాం. మా కులం, మా బంధువర్గం, నా అనుచర వర్గం కొండవీటి చాంతాండంత ఉంది. కాబట్టి మీ పార్టీకి సపోర్టు చేయాలంటే మాకు లక్షల్లో ఆదాయం చూపితే వస్తం అంటూ మధ్యవర్తులతో రాయాబేరాలు సాగిస్తున్నారు. అయితే ఇలా రాయబారాలు సాగించే పలువురు నేతలకు ఓటింగ్ మాత్రం అత్యంత తక్కువగా ఉన్నాయి. పైకి మాత్రం గతంలో పదవులు అనుభవించిన స్థాయి, వెనుక తిరిగే అనుయాయులను చూపుతూ బేరాలు సాగిస్తున్నారు. 'మా తాతలు నేతులు తాగారు, మా మూతులు వాసన చూడండి' అన్న విధంగా కొందరు నేతల ప్రవర్తన ఉంటోంది. ప్రజల్లో మాత్రం ఆ నేతకు జీరో అని చెప్పుకుంటున్నా గతంలో వారు ఉన్న పదవులు (ప్రస్తుతం మాజీలే) చూపిస్తూ మేం వస్తే మీ పార్టీకి లాభమని చెప్పుకుంటున్నారు. ప్రధాన పార్టీల నేతలు మాత్రం నమ్మడం లేదు. వీరు ఉన్న ప్రాంతంలోనే వీరు అనుచరవర్గం చెబుతున్నారో వారికి ఇస్తే మాకు మరిన్ని ఓట్లు వస్తాయి కదా అనివీరికి ఇవ్వ డం ఎందుకని ఓ వైపు ఆలోచన చేస్తున్నారు. మరో వైపు మాత్రం నీతో పాటు నీ అనచర వర్గం బంధువర్గం మొత్తం రావాల్సిందే. నీవు ఒక్కడివి సరిపోదు అంటూ ప్రధాన పార్టీల నేతలు చెబుతున్నారు. ఇలా చెన్నూరులో రోజూ ఒక నాయకుడి విషయం బయటికి పొక్కడం మా సత్తా ఇంత ఉంది అని చెప్పుకోవడం జరుగుతుంటే స్థానికులు మాత్రం ఈ బిల్డప్‌లకు ఏమీ కొదవలేదు. అసలు వీరికి ఓట్లు ఉన్నాయా ఇప్పుడు డబ్బు ఇస్తే అసలు ఓటుకు వస్తారా లేదా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. మొత్తమ్మీద బిల్డప్ నేతల మాటలు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఏ మేరకు నమ్ముతారో వారికి లక్షలు ముట్టచెబుతారా, లక్షణంగా పక్కనబెడతారా అన్నది మరో వారంలో తేలిపోనుంది. ఈ లోగా నేతలు తమ అనుచరవర్గాన్ని వారున్న ప్రాంతంలోనే విస్తృత ప్రచారం గాలిస్తూ మరింత ఓటింగ్‌శాతం పెంచుకోవడం ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు. అందులో టీడీపీ మరింత ముందుజంలో ఉందని చెప్పకనే చెబుతుంది.

జిల్లా కేంద్రం ప్రకటనతో.. తొలి విజయం!

● వెల్లువెత్తిన హర్షాతిరేకాలు ● కూటమి అభ్యర్థుల గెలుపుపై సానుకూల ప్రభావం ● సుగవాసికి ప్రశంసల వెల్లువ

రాజంపేట టౌన్, ఏప్రిల్ 25 : తాను ఎమ్మెల్యే కాగానే, రాజంపేటను జిల్లా కేంద్రం చేసి తీరుతా.. అంటూ టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం ఇచ్చిన మొట్టమొదటి హామీపై.. ఎమ్మెల్యే కాకముందే టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడును ఒప్పించి.. కీలక ప్రకటన చేయించడంతో నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తనకు టీడీపీ టికెట్టు ప్రకటించిన తరువాత రాజంపేటకు వచ్చిన సుగవాసిబాలసుబ్రమణ్యం వారం రోజులలోపే ఈ ప్రాంత ప్రజల మనోభావాలను గుర్తించి రాజంపేట జిల్లా కేంద్రం అంశంపై అన్ని ప్రాంతాల్లో స్పష్టమైన ప్రకటన చేశారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా పార్టీ ధిక్కరణ అనుకున్నా, అసెంబ్లీలో తన గళాన్ని వినిపించి జిల్లా కేంద్రం తెచ్చి తీరుతానని పదేపదే ప్రకటించారు. ఎన్నికల సభలో పాల్గొనే ముందు టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుతో ఈ విషయం మాట్లాడి ఒప్పించగలిగారు.. చంద్రబాబునాయుడు రాజంపేట సభలో ప్రసంగిస్తూ మీకు జరిగిన అన్యాయమేంటి.. అంటూ ఐదు సార్లు ప్రజలతో చెప్పించుకొని.. జిల్లా కేంద్రం కావాలని వారితో నినాదాలు చేయించుకొని ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా జిల్లా కేంద్రం చేసి తీరుతా అంటూ ప్రకటన చేసి అందరినీ ఉత్సాహపరిచారు. చంద్రబాబు ఈ మేరకు ప్రకటించగానే సభా ప్రాంగణమంతా చప్పట్లతో మారుమోగిపోయింది. ఈ అంశంలో సుగవాసి బాలసుబ్రమణ్యం పోషించిన పాత్ర ప్రశంసలందుకుంది. ఆయన గెలుపులో సైతం ఈ విషయమే కీలక పాత్ర పోషించనుంది.. సరైన సమయంలో ఈ ప్రకటన చేయించడంపై పార్టీలకు అతీతంగా రాజంపేట వాసులు, మేధావులు ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం, ఎంపీ అభ్యర్థి మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిలు భారీ మెజారిటీతో గెలుపొందుతారని ప్రతి ఒక్కరూ అంటున్నారు.

హుషారుగా.. ఉత్సాహంగా

చాలా వరకు ముభావంగా ఉండే టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంలో అధినేతల రాకతో ఒక్కసారిగా జోష్.. బయటపడింది. హెలిప్యాడ్ వద్ద టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను చూసిన వెంటనే ఆయన ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఈ ప్రాంత సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చి సభలో హామీ ఇవ్వాలని కోరడం, అందుకు చంద్రబాబు నాయుడు అంగీకరించడంతో ఆయన ఆనందానికి అంతేలేకుండా పోయింది. జిల్లా ప్రకటన చేస్తారని తెలిసిపోవడంతో ఒక్కసారిగా కారుపై ఎక్కి విక్టరీ సింబల్ చూపడం ముచ్చటగొలిపింది. సభాస్థలి వద్ద నాయకులతో కలిసి ఐక్యతారాగాన్ని ఆలపించడం, సభలో గంభీరంగా ప్రసంగించడం ఓటర్లను ఆకట్టుకుంది.

సభ విజయవంతంతో సమరోత్సాహం

టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు సంయుక్తంగా నిర్వహించి సభ సంపూర్ణంగా విజయవంతం కావడంతో టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంను అందరూ ప్రశంసలతో ముంచెత్తారు. సుగవాసిపై అభిమానంతో ఈ సభకు ఆరు మండలాల నుంచి వందలాది వాహనాల్లో వేలాది మంది అభిమానులు తరలివచ్చారు. పోలి సుబ్బారెడ్డి, జనసేన పార్టీ నేతలు అతికారి కృష్ణ , యల్లటూరు శ్రీనివాసరాజు, మలిశెట్టి వెంకటరమణ, బీజేపీ పార్లమెంటు అధ్యక్షుడు సాయిలోకేష్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, పోతుగుంట రమేష్ నాయుడు తదితర అన్ని పార్టీల నేతలు, ప్రధానంగా పట్టణంలోని కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు, జనసేన పార్టీ అభిమానులు, టీడీపీ క్యాడర్‌తో పాటు ఆరు మండలాల నుంచి పెద్దఎత్తున తరలి రావడంతో రాజంపేట పట్టణం జనసముద్రంలా మారిపోయింది.

ఈ సందర్భంగా రాజంపేటకు ఇరువైపులా భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కడప-రేణిగుంట రోడ్డులో రాజంపేట నుంచి ఇటు పుల్లంపేట వరకు, అటు నందలూరు వరకు ఇరువైపులా సుమారు గంట పాటు వాహనాలు నిలిచిపోయాయి.



టీడీపీ, జనసేన అధినేతలు రాజంపేటకు వచ్చిన సందర్భంగా కారుపైనుంచి విక్టరీ గుర్తు చూపుతున్న సుగవాసి బాలసుబ్రమణ్యం



రాజంపేటలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు నిర్వహించిన సభకు తరలి వచ్చిన జనసముద్రం

చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌కు ఘన స్వాగతం

టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుకు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌కు గురువారం రాజంపేటకు వచ్చిన సందర్భంగా టీడీపీ, జనసేన నేతలు ఘనంగా స్వాగతం పలికారు.

రాజంపేటకు వచ్చిన వారిరువురికి మాజీ మంత్రి సి.రామచంద్రయ్య, ప్రముఖ పారిశ్రామిక వేత్త, రీజెన్సీ సిరామిక్స్ అధినేత డాక్టర్ జి.ఎన్.నాయుడు, రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం, టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, కడప నేతలు శ్రీనివాసరెడ్డి, బద్వేలు విజయమ్మ, ప్రొద్దుటూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరదరాజులరెడ్డి, ప్రొద్దుటూరుకు చెందిన ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రాయచోటి ఎమ్మెల్యే అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు హరిప్రసాద్, సుగవాసి ప్రసాద్‌బాబు, వేమన సతీశ్, రాజంపేట టీడీపీ ఎన్నికల అబ్జర్వర్ దుర్గాప్రసాద్, పోలి సుబ్బారెడ్డి, డాక్టర్ చెన్నూరు సుధాకర్, రాజంపేట జనసేన పార్టీ నేతలు అతికారి కృష్ణ, యల్లటూరి శ్రీనివాసరాజు, మలిశెట్టివెంకటరమణ, బీజేపీ పార్లమెంటు అధ్యక్షుడు సాయిలోకేష్, మహిళా పార్లమెంటు మహిళాధ్యక్షురాలు పత్తిపాటి కుసుమకుమారి, మాజీ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మోదుగుల పెంచలయ్య, రాజంపేట మండల పార్టీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్యనాయుడు, లీగల్‌సెల్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, మదనపల్లెకు చెందిన రాందాస్ చౌదరి, జనసేన వీర మహిళలు రెడ్డిరాణి, గీతాంజలి రమణ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతల భూదాహంతోనే
మా కుటుంబం ఆత్మహత్య

● బాధితురాలు లక్ష్మీప్రసన్న ఆవేదన

ఒంటిమిట్ట మండలం మాధవరంలో వైసీపీ నేతలు తమ భూములకు సంబంధించిన ఆన్‌లైన్‌లో పేర్లు తొలగించి ఇబ్బందులకు గురి చేయడంతో సుబ్బారావు కుటుంబంలో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్న వ్యవహారంపై ఆ కుటుంబంలో మిగిలిన సుబ్బారావు కుమార్తె లక్ష్మీప్రసన్న సభలో తమకు జరిగిన అన్యాయాన్ని వివరించింది. తన తండ్రి సుబ్బారావుకు నాలుగు ఎకరాల పొలం ఉండేదని, ఈ పొలం భూములకు సంబంధించిన నెంబర్లను వైసీపీ నేతలు ఆన్‌లైన్ నుంచి తొలగించడంతో తన తండ్రి ఎంతో మనోవేదనకు గురయ్యారన్నారు. ఆ భూమిని అమ్మి తనను, చెల్లిని ఉన్నత చదువులు చదివించాలని అనుకున్నారని, అయితే వైసీపీ నేతలు ఆ భూమి నెంబర్లు ఆన్‌లైన్‌లో తొలగించడంతో అమ్మలేకపోయారన్నారు. ఎమ్మార్వో కార్యాలయానికి తిరిగి తిరిగి విసిగి వేసారి చేసేది లేక తన తండ్రి, తన తల్లి, తన చెల్లితో పాటు అందరూ ఆత్మహత్య చేసుకున్నారని, దీంతో తాను అనాథనయ్యానని కన్నీటి పర్యంతమంది. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు రూ.5 లక్షలు పంపి తనను ఆర్థికంగా ఆదుకున్నారని తెలిపింది. ఇందుకు స్పందించిన చంద్రబాబునాయుడు మాట్లాడుతూ లక్ష్మీప్రసన్న తండ్రి, తల్లి, చెల్లి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఎవ్వరూ మర్చిపోరన్నారు. ఈ ప్రాంత వైసీపీ నేతల ఆగడాలకు ఈ కుటుంబం ఆత్మహత్య ఒక ప్రధానమైనదన్నారు. ఇలాంటివి ఎన్నో ఈ ప్రాంతంలో చేశారన్నారు. లక్ష్మీప్రసన్నకు రూ.5 లక్షల ఆర్థిక సహాయంతో పాటు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగం ఇప్పించడంతో పాటు అప్పటి వరకు అన్ని విధాలా ఆదుకుంటామన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మీప్రసన్న

టీడీపీ నేతలతో చంద్రబాబు సమావేశం

రాజంపేట, ఏప్రిల్ 25 : టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు రాజంపేట అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం, టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, నియోజకవర్గ నాయకుడు పోలి సుబ్బారెడ్డితో రహస్యంగా సమావేశమయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికలు చాలా కీలకమైనవని జనసేన, బీజేపీ నేతలతో కలిసి రాజంపేటలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. ఎటువంటి పొరపాట్లు జరగకుండా అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. అభ్యర్థుల గెలుపుకోసం తీసుకోవాల్సిన ప్రధాన అంశాలను వారితో కలిసి చర్చించారు.



టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం, జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, పోలి సుబ్బారెడ్డితో చంద్రబాబు నాయుడు




కూటమి సభకు ర్యాలీగా వస్తున్న ఎంఆర్‌పిఎస్‌నాయకులు, కార్యకర్తలు

ర్యాలీగా తరలి వచ్చిన ఎంఆర్‌పీఎస్ నేతలు

రాజంపేట టౌన్, ఏప్రిల్ 25 : రాజంపేటలో ఎన్‌డీఏ సభ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ నాయకులు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించి తమ మద్దతు ప్రకటించారు. పాత బస్టాండు మీదుగా నినాదాలు చేసుకుంటూ తరలివచ్చారు.

సుగవాసిదే కీలకపాత్ర ..



జిల్లా కేంద్రం చేస్తామని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుతో ప్రకటన చేయించండంలో కీలక పాత్ర పోషించి న సుగవాసి బాలసుబ్రమణ్యం అభినందనీయుడు. ఇది ఆయనకు తొలి విజయం. మీకు కలిగిన అన్యాయం ఏమిటం టూ టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు పదేపదే ప్రశ్నించి జిల్లా కేంద్రం ఆకాంక్షను రాజంపేట ప్రజలతో చెప్పిం చుకొని, వారి మనోభావాలను గౌరవిస్తూ.. తాము అధికారం లోకి వచ్చిన వెంటనే రాజంపేటను జిల్లా కేంద్రం చేసి తీరుతామని ప్రకటిం చడంతో నియోజకవర్గ ప్రజల్లో ఆనందోత్సాహాలకు హద్దే లేకుండా పోయింది. దీంతో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలుపొందడం తథ్యం.. తథ్యం.

- ఎస్.వి.రమణ, విద్యావేత్త, గీతాంజలి విద్యాసంస్థలు రాజంపేట

ప్రజల్లో నూతనోత్సాహం..



రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తామని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రకటించడంతో నియోజకవర్గంలోని ప్రజల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. రాజంపేట టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం, ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి భారీ మెజారిటీ తో గెలుపొందడం ఖాయం. మహిళాలోకం తరపున తాను ఈ ప్రకటనపై ఆనందం వ్యక్తం చేస్తూ టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుకు, రాజంపేట టీడీపీ అభ్యర్థి బాలసుబ్రమణ్యంకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా.. రాజంపేట మహిళలతో పాటు, విద్యావేత్తలు, వ్యాపారులు, నిరుద్యోగులు, యువకులు అన్ని వర్గాల ప్రజలు హర్షిస్తున్నారు.

- మిరియాల జ్యోతి, టీడీపీ మహిళా నేత

గాలేరు-నగిరితో రాజంపేట సస్యశ్యామలం



గాలేరు-నగిరిని పూర్తి చేసి ఆరు మండలాలకు తాగు, సాగునీరు అందిస్తామని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రకటించడంతో రైతాంగం ఆనందాన్ని వ్యక్తం చేస్తోంది. అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయి రాజంపేట ఎగువ, దిగువ ప్రాంతాలు చుక్కనీరు లేక ఎడారిగా మారాయి. ఇక చెయ్యేరు, పెన్నానదిలో నీరు లేకపోవడం, రెండేళ్లుగా నీరు లేక చెరవులు, బావుల్లో నీరు లేకపోవడంతో ఈ ప్రాంతమంతా ఎడారిని తలపిస్తోంది. ఇటువంటి సమయంలో గాలేరు-నగిరి ద్వారా నీరందిస్తామని చెప్పడం అభినందించదగ్గ విషయం. ఈ సమయంలో రాజంపేటలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలుపొందుతారు..

- దగ్గుపాటి సుబ్రమణ్యం (డీఆర్‌ఎల్ మణి), వ్యాపారవేత్త,

వైసీపీ ఓటమి ఖాయం!



టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ప్రకటనలతో వైసీపీ ఓటమి ఖాయమైంది. జిల్లా కేంద్రంతో పాటు పింఛా, అన్నమయ్య ప్రాజెక్టుల పునరుద్ధరణ, ఒంటిమిట్ట, సిద్దవటం కోట అభివృద్ధి, మాచుపల్లి, టంగుటూరు బ్రిడ్జిలు, సుండుపల్లె కు ప్రత్యేక పథకం ద్వారా సాగు, తాగునీరు తదితరుల కీలక ప్రకటనల్తు టీడీపీ అభ్యర్థుల విజయాన్ని ఖాయం చేశాయి

- ఇడిమడకల కుమార్, బీసీ నేత, రాజంపేట.

క్రికెట్ సబ్ సెంటర్‌లో ఏసీఏ అధికారులు

నందలూరు, ఏప్రిల్ 25 : మండలంలోని అరవపల్లె జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో సీఏవైడీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ సబ్ సెంటర్‌ను ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధికారుల ప్రత్యేక బృందం సందర్శించింది. ఏసీఏ గేమ్ డెవలప్‌మెంట్ మేనేజర్ ఎంఎస్ కుమార్, అసిస్టెంట్ మేనేజర్ రోహిత్‌వర్మ, గేమ్ డెవలప్‌మెంట్ సౌత్ జోన్ మేనేజర్ ఖాజా మైనుద్దీన్, ఏవో, ఏసీఏ శ్రీనివాసులు, బీసీసీఐ అంపైర్ రవికాంత్‌రెడ్డి, బీసీసీఐ వీడియో అనలిస్ట్ రెహమాన్, ఏసీఏ అకాడమీ అసిస్టెంట్ కోచ్ ప్రసాద్ తదితర అధికారులు సబ్‌సెంటర్‌ను పరిశీలించి సబ్ సెంటర్‌లో శిక్షణ పొందుతు న్న క్రీడాకారుల ఆట తీరును అభినందించారు. కోచ్‌లను అభినందిస్తూ సబ్ సెంటర్‌కు కావాల్సిన మెటీరియల్ త్వరలో సమకూరుస్తామని తెలియజేశారు. మే నెల నుంచి సమ్మర్ కోచింగ్ క్యాంపు ప్రారంభమవుతుందని ఎ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు. ఈ అసిస్టెంట్ కోచ్ ఫిరోజ్ ఖాన్ లోడీ, ట్రైనర్ శివకోటి, క్యూరేటర్ హరికృష్ణ, క్రీడాకారులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో నారాయణ హవా

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 25 : జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో కడప నారాయణ కళాశాల విద్యార్థులు హవా కొనసాగించారని కళాశాల ప్రిన్సిపల్ మురళీమోహన్, వెంకటస్వామి, రాఘవరెడ్డి, సుధాకర్‌రెడ్డి తెలిపారు. చైతన్యక్రిష్ణ ఆలిండియా స్థాయిలో 360 ర్యాంకు సాధించారన్నారు. అలాగే ఎం.హాసిని 1169వ ర్యాంకు, హితేష్‌రెడ్డి 1735 ర్యాంకు, ఆర్.నిఖిల్ 2012, ఎస్.అహ్మద్‌అజిత్ 2204, కె.మేఘనారెడ్డి 2500, వై.వినయ్‌రెడ్డి 3320, బింద్ర 3663, సాయివైష్ణవి 4327, లక్ష్మిసాయి హాసిని 4787, జాగృతి 13425. నీరజ్ శబరి 14761, సాయిరుషికేశ్ 15426, నిఖిల సంధ్య 18396, రోహిత్‌రెడ్డి 45261 ర్యాంకు సాధించారన్నారు. 150 మందికి పైగా విద్యార్థులు జే ఈఈ అడ్వాన్సు ఫలితాల్లో అర్హత పొందారని తెలిపారు. రామ్మోహన్‌రెడ్డి, కోడీన్ చంద్రకిశోర్‌రెడ్డి, ఏ జీయం చెన్నక్రిష్ణారెడ్డి, వెంకటరామిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కేశవరెడ్డిలు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న నారాయణ కళాశాల యాజమాన్యం

జనసేన కార్యాలయంలో కిరణ్‌కుమార్‌రెడ్డి సమావేశం

రాజంపేట టౌన్, ఏప్రిల్ 25 : రాజంపేట పార్లమెంటు జనసేన నాయకులు యల్లటూరి శ్రీనివాసరాజు కార్యాలయంలో బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో గురువారం రాజంపేట బీజేపీ పార్లమెంటు అభ్యర్థి మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తనతో పాటు రాజంపేట పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాల కూటమి ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలన్నారు. కార్యకర్తలను ఆయన పరిచయం చేసుకున్నారు. జనసేన నాయకులు యల్లటూరి శ్రీనివాసరాజు, బీజేపీ పార్లమెంటు అధ్యక్షులు సాయిలోకేష్, రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతుగుంట రమేష్‌నాయుడు తదితరులు ప్రసంగిస్తూ కూటమివిజయానికి తమవంతు కృషి చేస్తామన్నారు.

వెలగచర్లలో శ్రీరామాలయం పునఃప్రారంభం

పెనగలూరు, ఏప్రిల్ 25 : మండలంలోని వెలగచర్ల గ్రామంలో ఏనుగుల వెంకటలక్షుమ్మ, శంకరయ్యల దంపతుల ఆధ్వర్యంలో పునర్నిర్మించిన దేవాలయంలో ఆదివారం వరకు పూజా కార్యక్రమాలు జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం ఉదయం పుణ్యాహ వచనం, రుత్విగ్వరణం, పంచగవ్యోపాసన, యంత్రకలశోపాసన, మహ మంగళ హారతి, సాయంత్రం మృత్సంగ్రహణము ఉంటాయన్నారు. రాత్రి 8 గంటలకు మంగళ నీరాజనము, నైవేద్యం, 27న శనివారం ప్రాతఃకాల పూజలు, యంత్రములకు, విగ్రహములకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు, హోమాలు, మధ్యాహ్నం మహానైవేద్యం, మంగళహారతి, తీర ప్రసాదాలు పంపిణీ చేస్తారని తెలిపారు. సాయంత్రం 4గంటలకు మూలమూర్తుల గ్రామోత్సవం, మహాస్తభనము, ప్రదోషకాల పూజలు, హోమాలు, 28న ఆదివారం ఉదయం ప్రాతఃకాల పూజలు, విగ్రహ ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట, హోమాలు, సీతారాముల కళ్యాణోత్సవం, అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.





పునర్నిర్మించిన రామాలయం, ఏనుగుల వెంకటలక్షుమ్మ, శంకరయ్య అందజేసిన సీతారామలక్ష్మణ, ఆంజనేయ ఉత్సవ మూర్తులు

అరాచకపాలనకు చరమగీతం పాడుదాం

రామాపురం, ఏప్రిల్ 25: మండలంలోని చిట్లూరి పంచాయతీ పాలన్నగారిపల్లెకు చెందిన వైసీపీ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రాచపల్లె ధర్మారెడ్డి, మాలపల్లె డీలర్ రమేష్ వార్డు మెంబరు రామలక్ష్మమ్మ ఆధ్వర్యంలో వంద కుటుంబాలు వైసీపీని వీడి రాయచోటి అసెంబ్లీ అభ్యర్థి రాంప్రసాదురెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి. పార్టీలో చేరినవారిలో ధర్మారెడ్డి, రెడ్డిగఫూర్, అన్వర్, ఖాసీమ్, ఖసు, సర్దార్, చాన్ బాషా ఉన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, జడ్పీటీసీ నాగసుబ్బారెడ్డి, నరసారెడ్డి, మదనమోహన్‌రెడ్డి, సాయికుమారెడ్డి, సురేంద్రనాథరెడ్డి, దేవదర్శన్‌రెడ్డి, చెన్నకృష్ణా రెడ్డి, యోగాంజ నేయరెడ్డి, జయరామిరెడ్డి, ప్రభాకర్, రామకృష్ణగౌడ్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు



టీడీపీలో చేరుతున్న వైసీపీ నేతలు

రైల్వేకోడూరులో ప్రజాగళం సభ విజయవంతం

రైల్వేకోడూరు, ఏప్రిల్ 25: గురువారం రైల్వేకోడూరులో జరిగిన ప్రజాగళం సభ విజయవంతం అయింది. నియోజకవర్గంలోని ఓబుల వారిపల్లె, చిట్వేలి, పెనగలూరు, రైల్వేకోడూరు, పుల్లంపేట మండలాల నుంచి వేలాది మంది భారీగా తరలి వచ్చారు. సభా స్థలికి చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు రాగానే జనం ఒక్కసారిగా చొచ్చుకు రావడంతో పోలీసులు కంట్రోల్ చేయలేకపోయారు. టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి ఆధ్వర్యంలో యువకుల ర్యాలీలు నిర్వహించారు. పవన్‌కళ్యాణ్, చంద్రబాబులకు మండలం లోని మైసూరివారిపల్లె కి సమీపం లో వేర్వేరుగా రెండు హెలిప్యాడ్స్ ఏర్పాటు చేశారు. సభా ఏర్పాట్ల ను స్వయంగా ముక్కా రూపానందరెడ్డి పర్యవేక్షించారు. అదనపు ఎస్పీ రాజ్‌కమల్, రాజంపేట డీఎస్పీ వీఎన్‌కే చైతన్య లు పర్యవేక్షించారు.

రైల్వేకోడూరు ను తిరుపతి జిల్లా లో చేర్చాలని రైల్వేకోడూరు ప్రజలు గురువారం జరిగిన ప్రజాగళం సభ లో యువకులు తదితరులు ప్లకార్డులు పట్టుకున్నారు. దీన్ని గమనించిన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ లు గమనించి మాట్లాడుతూ అడ్డగోలు గా జిల్లాలను చేసి పాపం పాపాల పెద్దిరెడ్డి మూట కట్టుకున్నారన్నారు. కూటమి అధికారంలోకి రాగానే రైల్వేకోడూరు ను తిరుపతి జిల్లా లో కలుపుతామని హామీ ఇచ్చారు.




ప్లకార్డులు ప్రదర్శిస్తున్న యువకులు

దుప్పి మాంసం స్వాధీనం

సిద్దవటం, ఏప్రిల్ 25 : మండలంలోని మద్దూరు బీట్ జంగాలపల్లి పరిసరాల్లో కుక్కల దాడిలో మరణించిన దుప్పికి చెందిన కొంత మాంసాన్ని జంగాలపల్లె హరిజనవాడకు చెందిన పాలెం సుబ్బరాయుడు, అజయ్ తీసుకెళుతుండగా అటవీ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. ఎస్.రాజంపేట బీసీ కాలనీ పరిధిలో మామిడి తోటలో కుక్కల దాడికి గురైన దుప్పిని కోస్తున్న తంగా గోపాలయ్య అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు అటవీ శాఖ సిబ్బంది తెలియజేశారు.

ఎక్కే గడప ... దిగే గడప!



ఇదీ సంగతి


రాష్ట్ర మంత్రి రోజా ఎక్కే గడప దిగే గడపతో సతమతమవుతున్నారు. పుత్తూరుకు చెందిన వైసీపీ కీలక నాయకుడు ఏలుమలై మొదలియార్ టీడీపీ తీర్థం పుచ్చుకోవడంతో ఆమె అలెర్ట్ అయ్యారు. అసమ్మతి వర్గ నేతల పట్ల ఇప్పటిదాకా ఉన్న బింకాన్ని సడలించుకుని వారి ఇళ్లకు తిరుగుతున్నారు. ఏలుమలై మొదలియార్ వర్గానికే చెందిన వైసీపీ నేత నారాయణబాబు ఇంటికి వెళ్లి తనకు సహకరించాలని రోజా కోరారు. అలాగే విజయపురం మండలానికి చెందిన అసమ్మతి నాయకుడు లక్ష్మీపతి రాజును కలిసేందుకు ప్రయత్నించినా ఆయన అందుబాటులో లేకపోవడంతో వెనుదిరిగారు. బుధవారం నగరి మున్సిపాలిటీకి చెందిన మొదలియార్ సామాజికవర్గంలో కీలక నాయకుడు పురుషోత్తం మొదలియార్‌ను ఆయన ఇంట్లోనే కలిశారు. అదే రోజు మధ్యాహ్నం నగరి మున్సిపల్ మాజీ చైర్మన్ కేజే కుమార్ ఇంటి గడప తొక్కారు. 'ఇప్పటి వరకు జరిగిందేదో జరిగిపోయింది...ఈ ఎన్నికల్లో నాకు సహకరించండి' అంటూ వారందరినీ కోరుతున్నట్లు సమాచారం. అయితే వెళ్లిన ప్రతిచోటా సానుకూలత లేకపోవడంతో ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నట్లు నియోజకవర్గంలో చర్చ జరుగుతోంది. రెండు వారాల క్రితం తిరుపతిలో శ్రీశైలం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డిని కలిసేందుకు ప్రయత్నించి విఫలమయ్యారని తెలిసింది. 'జరగాల్సిన నష్టం జరిగిపోయాక ఇప్పుడు గడప గడపకు తిరిగి లాభం ఏమిటి' అనే నిట్టూర్పులు వైసీపీ వర్గాల్లోనే వినిపిస్తుండడం విశేషం.

- పుత్తూరు అర్బన్

బీ-ఫారం.. ఏ-ఫారం అంటే..!

● మీకు తెలుసా ?

ఎన్నికల సమయంలో తరచూ ఏ-ఫారం, బీ-ఫారం అనే పదాలు వింటుంటాం. గుర్తింపు పొందిన ప్రాంతీయ లేదా జాతీయ రాజకీయ పార్టీలు తమ పార్టీ నుంచి ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థి వీరే అని ఇచ్చే ధ్రువీకరణ పత్రమే ఇది. ఈ ఫారాన్ని పార్టీ అధ్యక్షుడు గానీ, ప్రత్యేక ప్రతినిధి గానీ అభ్యర్థులకు అందజేస్తారు. నామినేషన్ నామినేషన్ పత్రంతోపాటైనా లేదా పరిశీలన సమయంలోనైనా రిటర్నింగ్ అధికారికి బీ-ఫారం అందించాలి. ఇలా బీ-ఫారం సమర్పించిన అభ్యర్థికే ఎన్నికల కమిషను ఆ పార్టీల గుర్తులను కేటాయిస్తుంది. లేకపోతే స్వతంత్ర అభ్యర్థిగా పరిగణిస్తారు.



● ఇక, పార్టీ అధ్యక్షుడు లేదా పార్టీ నియమించిన ప్రత్యేక ప్రతినిధి అభ్యర్థులకు బీ-ఫారం అందిస్తారు. బీ ఫారం ఇచ్చే అధికారాన్ని ఆ ప్రతినిధికి అప్పగిస్తూ ఇచ్చేదే ఏ-ఫారం. దీనిని తీసుకున్న వ్యక్తికే అభ్యర్థులకు బీ-ఫారం ఇచ్చే అధికారం ఉంటుంది. ఫారం తీసుకున్న వ్యక్తి దానిని ఎన్నికల అధికారికి సమర్పించి తానే బీ-ఫారం ఇచ్చినట్లు స్పష్టం చేయాలి.

- చిత్తూరు కలెక్టరేట్

● నోట్ దిస్ పాయింట్

● 2009 నియోజకవర్గాల పునర్విభజనతో కొత్తగా ఏర్పడిన నియోజకవర్గాలు: పూతలపట్టు, జీడీనెల్లూరు

● అంతరించి పోయినవి: పుత్తూరు, వేపంజేరి

నగరి నియోజకవర్గంలో ఐదు మండలాలు ఉన్నాయి. నగరి, విజయపురం, నిండ్ర మండలాలు చిత్తూరు జిల్లాలో, పుత్తూరు, వడమాలపేట తిరుపతి జిల్లాలో ఉన్నాయి. కానీ, నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణ బాధ్యత పూర్తిగా చిత్తూరు కలెక్టర్‌దే.

● హెచ్చరిక



రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే జైలే

కొందరు అభ్యర్థులు సెంటిమెంట్‌ను రెచ్చగొడితేనే ఓట్లు పడతాయని భావించి కులం, వర్గం, ప్రాంతం పేరుతో ఇష్టారాజ్యంగా మాట్లాడుతుంటారు. ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలకు అడ్డుకట్ట వేసేందుకు ఎన్నికల సంఘం నియమావళిలో కఠిన నిబంధనలు రూపొందించింది. ఎన్నికల్లో ఎవరైనా జాతి, మత, కుల, భాష, సమాజం పేరుతో రెచ్చగొడితే ఆర్‌పీ చట్టం 1951 సెక్షన్ 125, ఐసీపీ సెక్షన్ 153ఏ ప్రకారం మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తారు. ఓటు కోసం మద్యం, డబ్బులు, ఇతర వస్తువులు తీసుకున్న వారిని కూడా నేరస్థులుగానే పరిగణిస్తారు. ఐపీసీ సెక్షన్ 171బి, 171ఇ, హెచ్ ప్రకారం లంచంగా పరిగణించి ఏడాది జైలు శిక్ష విధిస్తారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రవాహంపై నిఘా పెంచారు. నజరానాలకు లొంగినా, ఓటర్లను ప్రలోభాలకు గురి చేసినా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు.

- చిత్తూరు

జన కేతనం

శుక్రవారం 26 ఏప్రిల్ 2024





ఎంకే పురం (ఆంధ్రప్రదేశ్)

మండల కేంద్రమైన శాంతిపురానికి కేవలం ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న పంచాయతీ కేంద్రమిది. కనీసం గ్రామం పేరును సూచించే బోర్డూ లేదిక్కడ. పాత పంచాయతీ భవనంమీద రాతను చూసి ఇది ఎంకేపురం అని తెలుసుకోవాలి. ఈ గ్రామాన్ని పరిశీలిస్తే..

జగన్ బటన్ నొక్కితే జనం అకౌంట్లలో కాసులు పడుతున్నాయో లేదో కానీ.. గ్రామాలు మాత్రం ఆయన ఐదేళ్ల పాలనలో బీడుపడ్డాయి. పంచాయతీ నిధులు పక్కదారి పట్టగా, కనీసమైన సదుపాయాలకు, సౌకర్యాలకు నోచుకోక అలో లక్ష్మణా అంటూ ఆవేదన చెందుతున్నాయి. పొరుగు రాష్ట్రాల గ్రామాలతో పోలిస్తే ఏపీ గ్రామాలు నిజంగానే ఎడారులను తలపిస్తున్నాయి. కరెంటు లేక పొలాలు బీళ్లు పడితే, తాగేనీళ్లు లేక ప్రజల గొంతులు ఎండుతున్నాయి. వీధులు, మురుగునీటి కాలువలు, వీధి లైట్లు.. అన్నింటికీ అన్ని సదుపాయాలూ పొరుగు రాష్ట్రాలతో చూస్తే తీసికట్టుగా ఉంది. మూడు రాష్ట్రాల కూడలిలోని కుప్పం నియోజకవర్గంలోని ఎంకేపురాన్ని.. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోని వేపనపల్లె, బెండవారం గ్రామాలను 'ఆంధ్రజ్యోతి' క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ఈ మూడు గ్రామాల్లోని సదుపాయాలు, సౌకర్యాలు, సమస్యలను పోలుస్తూ ఇస్తున్న సచిత్ర కథనమిది.

- కుప్పం

సిగ్గు పడాలా.. వద్దా?



తాగునీటి కష్టం : ఊళ్లోని బోరునుంచి వస్తున్న తాగునీళ్లు ఏమాత్రం చాలడంలేదు. కనీసం పైపులైన్లు వేసే దిక్కు లేదు. పంచాయతీ పాలకులను, అధికారులను అడిగి అడిగి విసిగిపోయిన ప్రధాన వీధిలోని సుమారు పది కుటుంబాలు ఏడాది కిందట దాదాపు రూ.10 వేలు సొంత నిధులు ఖర్చు చేసి పైపులైన్ వేయించుకున్నాయి. డబ్బు, శ్రమ వృథానే తప్ప వీరిదాకా నీళ్లు రావడంలేదు. దీంతో రచ్చబండ దగ్గర ఉన్న బోరునుంచి నీటిని బిందెల ద్వారా మోసుకొస్తున్నారు.

శుద్ధ జలం ఏదీ? : టీడీపీ హయాంలో ఎన్టీఆర్ సుజల పథకం ద్వారా ఒక ట్యాంక్ ఏర్పాటు చేసి రూ.2కే గ్రామమంతా శుద్ధ జలం సరఫరా చేశారు. వైసీపీ అధికారంలోకి రాగానే ఆ ట్యాంకు మూలన పడింది. తుప్పు పట్టిన ఈ ప్లాంటు చుట్టూ పిచ్చి మొక్కలు మొలిచాయి.



'పొరుగు' ముందు తలవంపులు!

● ఇతర రాష్ట్రాల గ్రామాల ముందు ఏపీ గ్రామం తీసికట్టు ● సదుపాయాలు, సౌకర్యాలు సున్నా

విద్యుత్తు సరఫరా దారుణం

కరెంటు ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు కోతలు విధిస్తారో తెలియని పరిస్థితి. అన్ని విద్యుత్తు స్తంభాలకు లైట్లున్నా.. ముప్పావువంతు వెలగడం లేదని గ్రామస్థులు చెబుతున్నారు. పంచాయతీ పాలకులకు, అధికారులకు చెప్పినా లైట్లు మార్చలేదన్నారు.



మురుగుకంపు : గ్రామం ముఖద్వారంలో అతిపెద్ద మురుగునీటి కాలువ కనీసమైన నిర్వహణ లేక కంపు కొడుతోంది. ఈ కాలువను ఊరి చెరువులో కలిపారు. ఇక గ్రామం లోపలి కాలువలు చాలావరకు ధ్వంసమయ్యాయి. ఎక్కడికక్కడ మురుగు నిలిచి దుర్గంధం వ్యాపిస్తోంది. అంటువ్యాధులకు కారణమవుతోంది.



అసంపూర్తిగా కమ్యూనిటీ హాలు

టీడీపీ హయాంలో నిర్మాణం మొదలు పెట్టిన కమ్యూనిటీ హాలును వైసీపీ ప్రభుత్వం అలాగే వదిలేసింది. ప్రస్తుతం ఈ అసంపూర్తి భవనాన్ని గ్రామస్థులు పశువులు కట్టుకోవడానికి, ట్రాక్టర్లు నిలబెట్టుకోవడానికి, గడ్డి మోపులు పెట్టుకోవడానికి ఉపయోగించుకుంటున్నారు.



వీధులు అధ్వానం

గ్రామంలోని చాలావరకు సిమెంటు రోడ్లు లేవు. గుంతలు మిట్టలుగా ఉన్న మట్టిరోడ్లే దర్శనమిస్తున్నాయి. కొన్ని వీధులకు ఎప్పుడో వేసిన సిమెంటు రోడ్లు కంకర తేలాయి.



ఈ రోడ్లనూ పట్టించుకునే దిక్కేది?

గ్రామంలోని రోడ్లే కాదు.. ఎంకేపురాన్ని మండల కేంద్రమైన శాంతిపురంతో అనుసంధానం చేసే తారు రోడ్డు చాలాచోట్ల గుంతలు పడి, ప్యాచ్‌లతో దారుణంగా ఉంది. కర్ణాటక సరిహద్దు రాయికి ఇవతల మన ఏపీ రోడ్డు పరిస్థితి దారుణంగా మారింది. గుంతలు తేలి, దుమ్ము రేగుతూ ఉంది.



బెండవారం (కర్ణాటక)

కర్ణాటక రాష్ట్రం కేజీఎఫ్ తాలూకాలోని పంచాయతీ కేంద్రమిది. శాంతిపురం మండలం ఎంకే పురం పంచాయతీకి కేవలం ఒకటిన్నర కిలోమీటరు దూరంలో ఉంది. సరిహద్దు అవతల ఉన్న ఈ గ్రామంలో అన్ని సదుపాయలతో ప్రజలు జీవనం సాగిస్తున్నారు.



ప్రతి ఇంటి ముందూ కొళాయిలు

వీధివీధినా పైపులైన్లు వేసి ఇంటింటికీ కొళాయి పెట్టారు. రోజులో రెండు సార్లు.. రెండుమూడు గంటలపాటు నీళ్లు వదులుతున్నారు. ప్రస్తుతమైతే నేరుగా బోరునుంచే పైపులైన్లు వేశారు. రక్షిత మంచినీటి ట్యాంకు నిర్మాణం దాదాపు పూర్తయింది. ఇది అందుబాటులోకి వస్తే 24 గంటలూ తాగునీరు అందుతుందని స్థానికులు తెలిపారు.

అందుబాటులో శుద్ధ జలం

పంచాయతీ మధ్యలోనే శుద్ధజల ప్లాంటు ఏర్పాటు చేసి రూ.5కు 20 లీటర్ల నీటిని అందిస్తున్నారు. ఎప్పుడు వెళ్లినా నీళ్లు అందుబాటులో ఉంటున్నాయి. ప్రభుత్వాలు మారినా శుద్ధ జలం ప్లాంటు నిర్వహణను విస్మరించడంలేదు.





ఎటు చూసినా సిమెంటు రోడ్లు, కాలువలు

గ్రామంలోని అన్నీ సిమెంటు రోడ్లే. అవి కూడా శుభ్రంగా దర్శనమిస్తున్నాయి. ప్రతి వీధికీ సిమెంటు కాలువలు నిర్మించారు. అక్కడక్కడా కొద్దిగా కాలువల్లో చెత్త కనిపిస్తున్నా, ఆ చెత్త అడ్డుపడే పరిమాణానికి పెరిగే సమయానికి పంచాయతీ వారు శుభ్రం చేసేస్తారని స్థానికులు తెలిపారు. ఎక్కడా మురుగునీరు నిల్వ ఉండటం లేదు.



24 గంటలూ విద్యుత్తు సరఫరా

గ్రామానికి 24 గంటలూ విద్యుత్తు సరఫరా అవుతోంది. నాలుగుచోట్ల ప్రధాన కూడళ్లలో స్పన్ పోల్స్ ఏర్పాటు చేసి ఎనిమిదేసి పెద్ద డూమ్ లైట్లు ఏర్పాటు చేశారు. ఇవిగాక వీధుల్లోని విద్యుత్తు స్తంభాలకూ లైట్లు అమర్చారు. వీటి వెలుగుల్లో గ్రామం కాంతులీనుతోంది.

రహదారులు బాగున్నాయ్

తాలూకాలోని ఇతర ప్రాంతాలకు వెళ్లే రోడ్లు.. పొరుగు రాష్ట్రాలతో అనుసంధానమయ్యే రోడ్ల నిర్వహణ బాగుంది. గుంతలు, డ్యామేజీ కనిపించడంలేదు.



వేపనపల్లె (తమిళనాడు)



తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి తాలూకాలోని పంచాయతీ కేంద్రం వేపనపల్లె. కుప్పం నియోజకవర్గం గుడుపల్లె మండలం ఓఎన్ కొత్తూరు నుంచి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది చిన్న పట్టణంగా అభివృద్ధి చెందిన ఈ గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు అన్నీ అమరాయి.

శుద్ధ జలమూ ఉంది

గ్రామానికి రెండు శుద్ధ జలం ప్లాంట్లు ఉన్నాయి. రూ.5కే 20 లీటర్ల నీటిని అందిస్తున్నారు. రోజులో ఎప్పుడు వెళ్లినా నీళ్లు అందుబాటులో ఉంటోంది. ఈ రెండు పాంట్లలో ఒకటి రెండు రోజుల కిందట మరమ్మతులకు గురైంది. త్వరలోనే బాగుచేసి అందుబాటులోకి తెస్తారని గ్రామస్తులు అక్కడి పంచాయతీ పాలకుల తీరుపై విశ్వాసం వ్యక్తం చేయడం విశేషం.





కొళాయి తిప్పితే నీళ్లే

గ్రామంలోని ప్రతి ఇంటి ముందూ కొళాయి ఏర్పాటు చేశారు. రెండు ఇళ్ల మధ్య ఐదారు అడుగుల దూరమున్నా రెండు కొళాయిలు ఉంటాయి. ప్రత్యేకంగా రక్షిత మంచినీటి ట్యాంకు ద్వారా 24 గంటలపాటూ తాగునీరు సరఫరా అవుతుంది.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ.. సిమెంటు రోడ్లు



వేపనపల్లెలో మురుగునీటి కాలువలు నిర్మించి దానిపై ప్లేట్లు వేసి మూసేశారు. ఆపైన వీధులలో రోడ్లు వేశారు. అక్కడక్కడా మ్యాన్ హోల్స్ పెట్టారు. ఎక్కడైనా మురుగు నిలిచిపోతే ఈ హోల్స్‌ను తెరచి శుభ్రం చేస్తారన్న మాట. ఇంకా కొన్నిచోట్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు కావాల్సి ఉంది. అలాంటి చోట మాత్రం కొద్దిగా పారిశుధ్యం క్రమం తప్పింది. ఇక, గ్రామ వీధులన్నీ సిమెంటు రోడ్లు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రజలు కూడా ఇళ్ల ముందు రోడ్లలో చెత్తాచెదారం పడకుండా శుభ్రంగా ఉంచుకుంటున్నారు.

ఇక్కడా 24 గంటల విద్యుత్తు

గ్రామంలో విద్యుత్తు సరఫరా 24 గంటలూ ఉంటోంది. వీధి లైట్లు ఏర్పాటు చేయడం తక్కువే. ఇవి రిపేరైతే మాత్రం వెంటనే మరమ్మతులు చేయిస్తున్నారు.



వైభవంగా బోయకొండ గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ


బోయకొండ గంగమ్మతల్లి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 25: మండలంలోని వేంపల్లె గ్రామం, నల్లగుట్టపల్లె బోయకొండగంగమ్మ విగ్రహప్రతిష్ఠ కార్యక్రమం గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహకులు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరణలు చేసి కళశారాధన, హోమాలు, పూజలు అనంతరం బోయకొండ గంగమ్మను ప్రతిష్ఠించారు. పూజా కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ప్రత్యేకంగా తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాంచిన బాబు, దొరస్వామినాయుడు, మాజీ శాసనసభ్యుడు షాజహాన్‌బాషా కుమారుడు అక్బరీ, రాటకొండ బాబు రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, వేంపల్లె సర్పంచ్ ఆదెమ్మ, ఆమెభర్త పారేసు, నిర్వహకులు నారాయణ, గ్యాస్ రామకృష్ణ, నల్లప్ప, గణేష్, గ్యాస్ రమణ, నరేష్ పాల్గొన్నారు.

ప్రమాద బీమా పాలసీని సద్వినియోగం చేసుకోవాలి


బసినికొండ బ్రాంచి పోస్టాఫీసులో తనిఖీ చేస్తున్న చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ ప్రకాష్

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 25: పోస్టల్‌శాఖ కొత్తగా ప్రారంభించిన ప్రమాద బీమా పాలసీని సద్వినియోగం చేసుకునులా ప్రజలకు అవగాహన కల్పించాలని చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ ప్రకాష్ సూచించారు. గురువారం మండలంలోని బసినికొండ బ్రాంచి పోస్టాఫీసును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టల్‌శాఖలో ప్రమాద బీమా ప్రీమియం రూ.520 చెల్లిస్తే రూ.10లక్షల వరకు, రూ.320 ప్రీమియం చెల్లిస్తే రూ.5లక్షల వరకు ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. ప్రమాద బీమా పాలసీ తీసుకున్న పాలసీదారులకు మెరుగైన సేవలు, సౌకర్యాలు పోస్టల్ శాఖ అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ శాఖ అధికారులు శర్వనన్, నీలిమ, గణపతి, బీపీఎం నాగలత తదితరులు పాల్గొన్నారు.

రెండు వాహనాలు ఢీ ఇరువురు డ్రైవర్లకు గాయాలు

వాల్మీకిపురం, ఏప్రిల్ 25: రెండు వాహనాలు ఢీకొని ఇరువురి డ్రైవర్లు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం వాల్మీకిపురంలో చోటుచేసుకుంది. బిరాల మండలం పాతూరు గ్రామానికి చెందిన రమేష్(55) తన టాటా ఏస్ వాహనంలో మదనపల్లెకు వెళ్తుండగా అదే సమయంలో కళ్యాణదుర్గం నుంచి తిరుపతి వైపు వెళ్తున్న ఐషర్ వాహనం మండలంలోని టీఎం వ్యాలీ సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇరువురి డ్రైవర్ల రమేష్, వేణులకు తీవ్ర గాయాలు గాకా 108 సాయంతో హుటాహుటీన మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో ఒకరిని బెంగళూరుకు మరొకరిని తిరుపతికి మెరుగైన వైద్యం కోసం తరలించారు. స్థానిక ఎస్‌ఐ నాగేశ్వర్‌రావ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూటమిని గెలిపిస్తే.. అభివృద్ధి చూపిస్తాం


నిమ్మనపల్లెలో ఇంటింట ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు


మదనపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ శ్రేణులు

నిమ్మనపల్లి, ఏప్రిల్ 25: ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపిస్తే అభివృద్ధి చూపిస్తామని టీడీపీ రాజంపేట అధికార ప్రతినిధి ఆర్జే వెంకటేష్, మాజీ మండల అధ్యక్షుడు రాజన్న పేర్కొన్నారు. గురువారం తవళం పంచాయతిలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్ బాషాను, ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వారు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రతి ఇంటికి తిరిగి కరపత్రాలను పంచుతూ టీడీపీ అధికారంలోకి రాగానే బీసీల కొరకు టీడీపీ 50ఏళ్లకే పింఛన్‌ను ప్రవేశపెట్టిందన్నారు. మే13న జరిగే ఎన్నికల్లో వైసీపీని తగిన గుణపాఠం చెప్పి ఎమ్మెల్యేగా షాజహాన్‌బాషాకు సైకిల్ గుర్తుకు, ఎంపీగా కిరణ్‌కుమార్ రెడ్డికి కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించి చంద్రబాబుని ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డెప్ప, మాజీ ఎంపీపీ రామ కృష్ణ, మాజీ సర్పంచ్‌లు రమణ, చంద్రసింగ్, సోము, శంకర, నరసిం హులు, శ్రీపతి, మహమ్మద్‌రఫి, శ్రీరాములు, జగదీష్, రెడ్డెప్ప, జయన్న, చెంగ్రాయుడు, ఆదెమ్మ, ఖసింఖాన్, బాబు పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి..సంక్షేమం

మదనపల్లె, ఏప్రిల్ 25: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యమవుతుందని టీడీపీ నేత గంగారపు బాబురెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని రామాచార్లపల్లె, గంగన్నగారిపల్లె, గంగమ్మగుడి ప్రాంతాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజలకు టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమలు చేయబోయే సూపర్‌సిక్స్ పథకాలను కరపత్రాల ద్వారా వివరించారు. రాబోయే ఎన్నికల్లో ఒక ఓటు సైకిల్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా షాజాహాన్ బాషాను, రెండో ఓటు కమలం గుర్తుపై వేసి ఎంపీగా కిరణ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో గంగారపు బాబురెడ్డి, కత్తి లక్ష్మన్న, నటశేఖర్, రమేష్ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాబురెడ్డితో మంతనాలు.. నేటి నుంచి ప్రచారం

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 25: మదనపల్లె మాజీ ఎమ్మెల్యే రాటకొండ శోభ, సీనియర్ టీడీపీ నాయకులు రాటకొండ బాబురెడ్డితో ఉమ్మడి కూటమి అభ్యర్థి షాజహాన్‌బాషా గురువారం మంతనాలు జరిపారు. టీడీపీ అధిష్ఠానం ఆదేశాలతో పార్టీ పరిశీలకులు కంభంపాటి రామ్మోహన్‌రావు మాజీ ఎమ్మెల్యే శోభ, ఆమె భర్త బాబురెడ్డికి ఫోన్ చేసి పలు అంశాలు మాట్లాడారు. ఈ క్రమంలో షాజహాన్‌బాషా నేరుగా వెళ్లి బాబురెడ్డితో చర్చించారు. మదనపల్లెలో పార్టీ బలోపేతంగా వుందని బాబురెడ్డి ప్రచారం చేసి ఎన్‌డీఏ అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం చేయాలని కోరారు. దీనికి సమ్మతించిన బాబురెడ్డి శుక్రవారం నుంచి మదనపల్లె మండలం సీటీఎం గ్రామం నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇదిలా వుండగా మండలంలోని వేంపల్లె గ్రామం నల్లగుట్టవారిపల్లెలో బోయకొండ గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న బాబురెడ్డిని షాజహాన్‌బాషా తనయుడు జునైద్ అక్బారి మర్యాదపూర్వకంగా కలిసారు.

జేఈఈ మెయిన్స్‌లో వెంకటరెడ్డి సిద్ధార్థ విద్యార్థుల ర్యాంకుల పంట


విద్యార్థులకు అభినందనలు తెలుపుతున్న ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ యు25:ఎన్‌టీఏ ప్రకటించిన జేఈఈ మెయిన్స్ పరీక్ష ఫలితాల్లో మదన పల్లె ప్రశాంతనగర్‌లోని వెంకటరెడ్డి సిద్ధార్థ జూనియర్ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి పేర్కొన్నారు. ఇందులో సి. జ్యోతివర్మ 96.07, బి.చంద్రిక 95.91, ఎ.వినీల్‌కుమార్ 92.47, ఎస్ సమీన్ 90.80 పర్సెంటైల్ సాధించి జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించారన్నారు. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా మా విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో ర్యాంకులు సాధించడంపట్ల ఆనందం వ్యక్తం చేశారు. వివిధ క్యాటగిరిల్లో జేఈఈ అడ్వాన్స్ (ఐఐటీ)లో 73 మంది అర్హత సాధించారని ప్రిన్సిపాల్ చెప్పారు. ఇంతటి విజయానికి కృషి చేసిన విద్యార్థిని, విద్యార్థులకు, అధ్యాపక బృందానికి కృతజ్ఞలు తెలిపారు.

ఘనంగా ఎస్‌జీ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం



వార్షికోత్సవంలో ప్రసంగిస్తున్న ఎస్వీయూ వీసీ వి.శ్రీకాంత్ రెడ్డి

పీలేరు, ఏప్రిల్ 25: పీలేరులోని సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల 45వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్వీ యూనివర్సిటీ వీసీ వి.శ్రీకాంత్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ నూతన విద్యా విధానాన్ని ఆకళింపు చేసుకుని అందులోని పాఠ్యాంశాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలన్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి నివేదికను వీసీకి నివేదించారు. కార్యక్రమంలో మదనపల్లె బీటీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆనంద్ రెడ్డి, మదనపల్లె ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.కృష్ణవేణి, వాల్మీకిపురం ఎన్‌టీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, కలికిరి మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అంజలీ దేవి, పుంగనూరు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్, ఎస్‌జీ కళాశాల స్టూడెంట్స్ యూనియన్ ఉపాధ్యక్షులు శివరామిరెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బపై ప్రజలు అవగాహన అవసరం

నిమ్మనపల్లి, ఏప్రిల్ 25: ఎండల తీవ్రతను బట్టి వడదెబ్బ తగిలే ప్రమాదం వుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి రమేష్‌బాబు, ఎంపీడీవో శాలెట్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వైద్య సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఎండలు ఎక్కుగా వున్నందున ప్రజలు 9గంటల తరువాత బయటకు రాకూడదని ఒక వేల అత్యవసర పరిస్థితులో బయటకు వస్తే తలకు టోపి, టువాలు, గొడుగు, వంటివి వెంట బెట్టుకోవాలన్నారు, ప్రతి రోజు నీటిని ఎక్కువగా తాగాలని వాటితో పాటు కాటన్ బట్టలు ధరించాలని వీలైనంత వరకు బయటకు రావద్దని తెలిపారు. వడ దెబ్బ తగిలిన వ్యక్తులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్ నీటిని తాగించి వెంటనే ఆసుపత్రి తలించాలన్నారు. నిమ్మనపల్లిలో 40డిగ్రీల ఎండ నమోదు అవతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎమ్‌లు ఆశాలు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం


ప్రారంభానికి నోచుకోని సబ్‌జైలు భవనాలను చూపుతున్న టీడీపీ నేతలు

వాల్మీకిపురం, ఏప్రిల్ 25: పీలేరు నియోజకవర్గంలో వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమని వాల్మీకిపురం మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి విమర్శించారు. గురువారం పట్టణ సమీపంలోని మదనపల్లె రోడ్డులో ప్రారంభానికి నోచుకోని సబ్‌జైలు భవనాలను టీడీపీ నాయకులు సందర్శించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా, రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆయన సోదరుడు నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి హయాంలో కోట్లు విలువ చేసే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని అవన్ని వైసీపీ మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలకు కనపడలేదా? అని ప్రశ్నించారు. రూ.4కోట్లతో సబ్‌జైలు నిర్మాణం పూర్తయి దశాబ్దకాలం గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు వల్లిగట్ల వెంకటరమణ, రాజేంద్రాచారి, చంద్రమౌళి, అడ్వకేట్ రమణ, మదనమోహన్‌రెడ్డి, డిష్ బ్రదర్స్, చాను, అస్లాం, సాంబ పాల్గొన్నారు.

జనసందోహంతో మల్లెల పవన్ నామినేషన్


నామినేషన్ సందర్భంగా అశేషజన వాహినితో ఎమ్మెల్యే అభ్యర్థి మల్లెల పవన్, నియోజకవర్గనాయకుడు రెడ్డిసాహెబ్

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 25: మదనపల్లె కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లెలపవన్‌కుమార్‌రెడ్డి అశేష జనసందోహం నడుమ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఉదయం కదిరి రోడ్డులోని టిప్పు సుల్తాన్ మైదానం నుంచి భారీ జనంతో ర్యాలీగా మదనపల్లె కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు ఎస్‌రెడ్డిసాహెబ్ తోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఇండియా కూటమి నాయకులు పెద్దఎత్తున్న పాల్గొన్నారు. అనంతరం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి హరిప్రసాద్‌కు మల్లెల పవన్‌కుమార్‌రెడ్డి నామినేషన్ పత్రాలను అందజేశారు. అంతకముందు మీడియాతో వారు మాట్లాడారు. కార్యక్రమంలో పుంగనూరు కన్వీనర్ సింగం రామకృష్ణారెడ్డి, సురేంద్ర రెడ్డి, మహబూబ్‌పీర్, రవి, మహమ్మద్‌అలీ, ఈశ్వర్, పవన్‌కుమార్‌రెడ్డి, నరేంద్ర, పాలేటి, నారాయణ, సలీమ్, తదితరులు పాల్గొన్నారు.

రేపు తంబళ్లపల్లె నియోజకవర్గ సమావేశం

ములకలచెరువు, ఏప్రిల్ 25: ములకలచెరువులోని కేజీఎస్ కళ్యాణమండపంలో శనివారం తంబళ్లపల్లె నియోజకవర్గ స్థాయి బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల సమన్వయ కమిటీ సమావేశం జరుగుతుందని బీజేపీ రాష్ట్ర సహకార సెల్ కన్వీనర్ గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా రాజంపేట నియోజకవర్గ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, తంబళ్లపల్లె కూటమి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డిలు హాజరై దిశానిర్దేశం చేస్తారన్నారు. కావున బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మద్దతుదారులు తప్పక హాజరు కావాలని కోరారు.

కృషి, పట్టుదలతో ముందుకెళితే విజయాలు

కురబలకోట, ఏప్రిల్ 25(ప్రతి ఒక్కరూ జీవితంలో కృషి, పట్టుదలతో ముందుకెళితే విజయాలు సాధించవచ్చని సినీనటుడు నిఖిల్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల జాతీయస్థాయిలో నిర్వహిస్తున్న టెక్నోకల్చరల్ స్పోర్ట్స్ ఫెస్ట్ అశ్వ-2కె24 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తన నిజ జీవితంలో ఒక నిర్దిష్ట లక్ష్యాన్ని ఏర్పరచుకుని దానిని సాధించడానికి కృషి చేయాలన్నారు. హ్యాపీడేస్ సినిమా నాకు సినీ జీవితాన్ని ఇచ్చిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. అలాగే విద్యార్థులతో కలిసి డ్యాన్స్ చేసి యువతను ఆకట్టుకున్నాడు. అనంతరం ఆయనను పలువురు ఘనంగా సన్మానించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అలాగే బిగ్‌బాస్ కంటెస్టెంట్ ఆర్.జె.సూర్య పోటీలలో పాల్గొని గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, అకాడమి ప్రెసిడెంట్ నాదెళ్ల ద్వారకనాథ్, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపాల్ సి.యువరాజ్ అభినందించారు.

మలేరియా నిర్మూలనే ధ్యేయం

పీలేరు, ఏప్రిల్ 25: ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా పీలేరు మండలంలోని తలపుల, రేగళ్ల పీహెచ్‌సీల సిబ్బంది పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీలేరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్ మాట్లాడుతూ నిర్లక్ష్యం చేస్తే మలేరియా వ్యాధి ప్రాణాంతకం అవుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఈ కొండయ్య, సీహెచ్‌వో విజయలక్ష్మి, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, సీహెచ్‌వోలు, ఆశాలు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: వాల్మీకిపురం మండలం చింతపర్తి గ్రామంలో గురువారం ప్రపంచ మలేరియా సందర్భంగా అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా పురవీధులలో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్ర మంలో డాక్టర్ శ్రీవిద్య, సీహెచ్‌వో ఇందిరా రాణి, హెల్త్‌ఎడ్యుకేటర్ సూపర్‌వైజర్లు ఆశాలు పాల్గొన్నారు.

కలకడలో: వివిధ వ్యాధులకు కారణమైన దోమల నివారించాల్సిన బాధ్యత అందరిపై ఉందని డాక్టర్ కిశోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ప్రపంచ మలేరియ దినోత్సవం సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

నాలుగు నియోజకవర్గాలకు ఒకే ఎన్నికల పరిశీలకులు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 25: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల పరిశీలకులుగా కర్ణాటకకు చెందిన ఐఏఎస్ అధికారిణి కవిత మన్నికేరి నియమితులయ్యారు. ఈ క్రమంలో నాలుగు నియోజకవర్గాల్లో నిర్వహిస్తున్న అసెంబ్లీ ఎన్నికలను పర్యవేక్షించడంతో పాటు ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసేందుకు ఆమె బుధవారం పుంగనూరు నియోజకవర్గంలో పర్యటించారు. మిగిలిన మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు మూడు నియోజకవర్గాల్లో పర్యటించి ఎన్నికలు సవ్యంగా జరిగిలే చర్యలు చేపట్టనున్నారు.

నామినేషన్ల ప్రక్రియను పరిశీలించిన పరిశీలకురాలు

పీలేరు, ఏప్రిల్ 25: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పీలేరు అసెంబ్లీ నియోజకవర్గానికి ఎన్నికల సాధారణ పరిశీలకురాలిగా నియమితులైన కర్ణాటక ఐఏఎస్ అధికారిణి కవిత ఎస్.మన్నికర్ గురువారం నామినే షన్ల ప్రక్రియను పరిశీలించారు. ముందుగా ఆమె ఆర్‌వో కార్యాలయాన్ని సందర్శించారు. ఆర్‌వో కార్యాల యంలో జరిగిన నామినేషన్ల ప్రక్రియను పరిశీలించి అనంతరం మధ్యాహ్నం స్థానిక ఏఎంసీ ప్రాంగణంలోని పోలింగ్ బూత్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీలేరు తహసీల్దారు మహబూబ్ బాషా మాట్లాడు తూ ఎన్నికలు ముగిసే వరకు ఆమె పీలేరు నియోజకవర్గంలో పర్యటిస్తుంటారని, ఎన్నికల ప్రక్రియ నిబంధనల మేరకు జరుగుతున్నదో లేదో పరిశీలిస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో డీటీ సుబ్రహ్మణ్యం, ఆర్‌ఐ చాణక్య, పాల్గొన్నారు.

మదనపల్లెలో 19 మంది 33 సెట్ల నామినేషన్ల దాఖలు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 25: మదనపల్లె అసెంబ్లీ నియోజకవర్గం(164) ఎన్ని కలకు గాను వారం రోజుల పాటు నిర్వహించిన నామినేషన్ల ప్రక్రియలో గురువారం సాయంత్రం 3గంటల వరకు మొత్తం 19 మంది అభ్యర్థులు 33 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. ఇందులో టీడీపీ అభ్యర్థులుగా ఎం.షాజహాన్‌బాషా, ఆయన సతీమణి గుల్నాజ్‌బేగం, వైసీపీ అభ్యర్థులుగా నిస్సార్ అహ్మద్, ఆయన కుమారుడు మహ్మద్‌హసన్ షేక్, కాంగ్రెస్ అభ్యర్థిగా మల్లెల పవన్‌కుమార్, నరేంద్ర, బీఎస్పీ తరపున ఆర్.నరసింహులు నామినేషన్లు వేశారు. వారు పోగా జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక, పిరమిడ్, జై భారత్ పార్టీల తరపున ఒక్కొక్కరు, మిగిలిన వారిలో 9 మంది ఇండిపెండెంట్ అభ్యర్థులుగా నామినేషన్లు వేశారని రిటర్నింగ్ అధికారి హరిప్రసాద్ తెలిపారు.

పీలేరు అసెంబ్లీ బరిలో 15 మంది నామినేషన్లు దాఖలు

పీలేరు, ఏప్రిల్ 25: పీలేరు అసెంబ్లీ నియోజకవర్గానికి 15 మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఫర్మాన్ అహ్మద్ తెలిపారు. 15 మంది అభ్యర్థులు 27 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారని ఆయన తెలిపారు. తెలుగుదేశం పార్టీ తరపున ముగ్గురు అభ్యర్థులు 9 సెట్ల నామినేషన్లు, వైసీపీ తరపున ఇద్దరు అభ్యర్థులు 6 సెట్లు, కాంగ్రెస్ పార్టీ తరపున ఒక అభ్యర్థి 3 సెట్లు, బీఎస్పీ, అంబేద్కర్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ, జై మహాభారత్ పార్టీ తరపున ఒక్కొక్కరు, ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు వేసినట్లు ఆయన వివరించారు. కాగా పీలేరు అసెంబ్లీ స్థానానికి వైసీపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి గురువారం నామినేషన్ దాఖలు చేశారు.

తంబళ్లపల్లెలో 34 మంది నామినేషన్లు దాఖలు



ఆర్వో రాఘవేంద్రకు బీఫాం అందచేస్తున్న దాసరిపల్లె జయచంద్రారెడ్డి

తంబళ్లపల్లె, ఏప్రిల్ 25: తంబళ్లపల్లె శాసనసభ స్థానానికి 34 మంది నామినేషన్లు వేశారు. ఇందులో చివరి రోజైన గురువారం 13 నామినేషన్లను అంద చేయగా టీడీపీ అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డి బీఫాం ఆర్వోకు అంద చేశారు. టీడీపీ అభ్యర్థులుగా దాసరిపల్లె జయచంద్రారెడ్డి నాలుగు సెట్లు, ఆయన సతీమణి మంత్రి కల్పనారెడ్డి రెండు సెట్లు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దిరెడ్డి కొండ్రెడ్డి నాలుగు సెట్లు దాఖలు చేశారు. వైసీపీ అభ్యర్థులుగా పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి నాలుగు సెట్లు, పెద్దిరె డ్డిగారి కవిత రెండు సెట్లు, పెద్దిరెడ్డి వెంకట అభినయ్‌రెడ్డి రెండు సెట్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థులుగా ఎంఎన్ చంద్రశేఖర్‌రెడ్డి రెండు సెట్లు, ఎంఎన్ భానుచంద్రారెడ్డి ఒక సెట్, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా పి.అంజలి రెండు సెట్లు, జాతీయ జనసేన అభ్యర్థిగా దూలం జయచంద్రారెడ్డి, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా పార్టీ అభ్యర్థిగా కె.భాస్కర్, బహుజన్ సమాజ్ పార్టీ అభ్యర్థిగా ఎస్. సుజాత ఒక్కో సెట్ నామినేషన్లు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా గుండాల క్రిష్ణప్ప రెండు సెట్లు, ఎంఎన్ భానుచంద్రారెడ్డి, ఎం.సురేష్, పి.వెంకటరెడ్డి, ఎన్.నరసింహులు, ఎన్.విశ్వనాథరెడ్డి, వై.ద్వారక నాథరెడ్డిలు ఒక్కో సెట్ నామినేషన్‌లు దాఖలు చేశారు.

ఒక్క అవకాశం కల్పించండి..అభివృద్ధికి తోడ్పడండి

● కూటమి అభ్యర్థి జయచంద్రారెడ్డి సతీమణి కల్పనరెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి


బి కొత్తకోటలో ఓటర్లను అభ్యర్థిస్తున్న కూటమి అభ్యర్థి జయచంద్రారెడ్డి


ములకలచెరువులో ప్రచారం చేస్తున్న కూటమి అభ్యర్థి జయచంద్రారెడ్డి సతీమణి కల్పనరెడ్డి

ములకలచెరువు/బి.కొత్తకోట, ఏప్రిల్ 25: తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచిన తన భర్త దాసరిపల్లి జయచంద్రారెడ్డికి ఒక్క అవకాశం కల్పించి తంబళపల్లె నియోజకవర్గ అబివృద్ధికి బాటలు వేయాలని దాసరిపల్లి జయచంద్రారెడ్డి సతీమణి దాసరిపల్లి కల్పనరెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధతో కలిసి ములకలచెరువులో గురువారం ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గం అన్ని విధాల అభివృద్ధి చెందాలంటే కూటమి అభ్యర్థి జయచంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు ఓటర్లను కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు చెన్నకిష్టా, నాయకులు కట్టా హరినాథ్, రమణమూర్తి, ఆది, ప్రతాప్‌నాయుడు, సోము, నాగేంద్ర, కుళాయప్ప, నాగిరెడ్డి, ఉమాశంకర్, మధు, గౌతమ్, రవి, సునిత, జానకి పాల్గొన్నారు. ప్రశాంతమైన తంబళ్లపల్లెగా మార్పు కోసం టీడీపీ ని గెలిపించాలని ఉమ్మడి అభ్యర్థి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. టీడీపీ అభ్యర్థిగా బీఫాం పొందిన నేపథ్యంలో గురువారం ఆయన బి కొత్తకోట పట్టణంలో పర్యటించారు. మాజీ సర్పంచ్ కుడుం శ్రీనివాసులు నివాసంలో పట్టణ టీడీపీ నాయకులతో పార్టీ ఎన్నికల ప్రచారం పై సమీక్షంచారు. అనంతరం జ్యోతి సర్కిల్‌లో టీడీపీ మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంచుతూ తనను గెలిపించాలని పలువురు దుకాణదారులను అభ్యర్థించారు. ఆయన వెంట రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్, మండల కన్వీనర్ నారాయణస్వామిరెడ్డి, నాయకులు కుడుం శ్రీనివాసులు, కనకంటిప్రసాద్, దేరింగుల నారాయణ, సమీవుల్లా, యండీ మస్తాన్, కుడుం రంజిత్, గంజిమోహన, పద్మనాభ తదితరులు పాల్గొన్నారు.

కూటమి గెలుపుతో గ్రామాలకు మహర్దశ


కలకడలో ప్రజలకు పథకాలను వివరిస్తున్న నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి


కలికిరిలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

కలకడ, ఏప్రిల్ 25:రాష్ట్రంలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి గెలుపుతో గ్రామాలకు మహర్దశ పడుతుందని పీలేరు టీడీపీ ఉమ్మడి అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన నాయకులతో కలిసి కలకడ మండలం కోన, నడిమిచెర్ల, కదిరాయచెరువు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింట కరపత్రాలను అందజేసి ఉమ్మడి మేనిఫెస్టోను వివరించారు. అనంతరం మాట్లాడుతూ తన తండ్రి మాజీ మంత్రి దివంగత నల్లారి అమరనాథ్‌రెడ్డి హయాంలో పూర్వం వాయల్పాడు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్, తాగునీటి సౌకర్యాల కల్పనకు నాంది పలికారన్నారు. అలాగే సోదరుడు మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి హయాంలో రైతులకు లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి అన్ని మండలాల్లో విరివిగా విద్యుత్ సబ్ స్టేషన్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇదే అభివృద్ధి పరంపరా కొనసాగించేందుకు ప్రధానిగా నరేంద్రమోదీ, సీఎంగా చంద్రబాబునాయుడుని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు ఓటర్లు రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని, పీలేరు నియోజకవర్గ అభ్యర్థైన తనకు మద్దతు పలకాలన్నారు. కాగా ఆయా గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో పి.రాఘురామిరెడ్డి, మల్లారపు రవిప్రకాశ్, మద్దివట్ల సూర్యప్రకాశ్, ప్రభాకర్‌నాయుడు, దగ్గుబాటి వెంకటేశ్వరరావు, తిరుపతి నాయుడు, కోట రమణ, బివిస్వామి, కాంతారావు, శ్యామల, కుమారి, చంద్రమోహన్, త్యాగరాజు, తారకేశ్వర, గురుస్వామి, రెడ్డిశేఖర్, రాంమోహన్‌రెడ్డి, యుగంధర్ ఆచారి, రెడ్డెప్ప, మహేంద్ర, లక్ష్మీప్రసన్న, శ్రీనివాసుల నాయుడు, చంద్రశేఖర్, జనార్థన్‌నాయుడు, మల్లికార్జున్‌నాయుడు, రామచంద్ర, వెంకటేష్‌లు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి పలువురు టీడీపీలో చేరిక

కలకడ మండలం కోన, తిప్పగారిపల్లెకు చెందిన పలువురు వైసీపీ నుంచి టీడీపీ గూటికి చేరారు. గురువారం కిశోర్‌కుమార్‌రెడ్డి సమక్షంలో వారందరూ టీడీపీ కండువాను కప్పుకున్నారు. టీడీపీ తీర్థం పుచ్చుకున్న వారిలో శివశంకర్, రామకృష్ణ, రాజేశ్వరి, వెంకటరమణ, రాజశేఖర్‌నాయుడు, రామయ్యనాయుడు, అన్వర్‌లు ఉన్నారు.

నల్లారి సోదరులను గెలిపించి.. అభివృద్ధికి తోడ్పడండి

కలికిరి, ఏప్రిల్ 25: రాజంపేట పార్లమెంటు బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డిలను భారీ మెజారిటీతో గెలిపించి అభివృద్ధి కి బాటలు వేయాలని రాజంపేట పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు వాసునూరి చంద్రశేఖర్ కోరారు. స్థానిక నాయకులతో కలిసి గురువారం ఆయన మండలంలోని సంద్రావారిపల్లె పంచాయతీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లారి కుటుంబం హయాంలో తప్ప ఆ తర్వాత పీలేరు నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిన దాఖలాలు లేవన్నారు. మళ్లీ పీలేరు నియోజకవర్గం అభివృద్ధి బాటలో పయ నించాలంటే నల్లారి సోదరులను గెలిపించాలని ఆయన కోరారు. ప్రచారంలో టీడీపీ నాయకులు ప్రేమనాథరెడ్డి, రెడ్డి బాషా, రఫీ, కాదర్‌వల్లీ, రమణయ్య, ప్రభాకర, దేవేంద్ర, మల్లయ్య, నల్లయ్య, గంగాధర, షాబుద్దీన్ పాల్గొన్నారు.